J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 45 సంచిక : 17 26.9.2025, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

## • ఎవరేమన్నా, ఏదేమైనా...

# మూడేళ్ళు మౌనముద్ర.. ఆ తరువాత పాదయాత్ర



- భవిష్యత్ రాజకీయంపై వైసీపీ అధినేత వ్యూహం
- చంద్రబాబు పాలనా వైఫల్యాలపై బుక్‌లెట్
- చివరి రెండేళ్ళలో రెండో పాదయాత్రకు జగన్ నిర్ణయం

**త**న అయిదేళ్ల పాలనలో కొనసాగిన ఇసుక, గ్రావెల్, మైనింగ్ దోపిడీలతో పాటు మద్యం ముడుపుల ఆరోపణలు ఓ వైపు... పార్టీ వ్యవహారాలలో ఇప్పటికీ మితిమీరుతున్న సజ్జల రామకృష్ణారెడ్డి జోక్యంపై పార్టీ నేతలలో బహిర్గతమవుతున్న అసంతృప్తి మరోవైపు. వీటన్నికీ తోడుగా తనకి ప్రతిపక్ష హోదా ఇస్తే తప్ప శాసనసభలో అడుగు పెట్టబోనన్న జగన్‌మోహన్‌రెడ్డి మొండి వైఖరి ఇంకో వైపు. వీటన్నిటి నేపథ్యంలో ప్రజల సమస్యలు పట్టించుకోవడం లేదంటూ అన్నివైపుల నుండి విమర్శలు, సామాజిక మాధ్యమాలలో వేలాది ట్రోలింగులు. ఇన్ని జరుగుతున్నా... వైసీపీ అధినాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం "ఉలకను, పలకను, పలికినా పట్టించుకోను" అన్న తరహాలో మౌనం పాటిస్తున్నారు. ఫలితంగా వైసీపీ కేడర్‌లోనూ నిస్తేజం ఆవరిస్తోంది. పార్టీ ఎటుపోతోంది..? ప్రజాక్షేత్రంలో సమస్యలపై గళమెత్తే అవకాశాన్ని గాలికి వదిలేసి ప్రెస్‌మీట్లు, ట్వీట్లు, పరామర్శలకే పరిమితమైతే భవిష్యత్ ఏమిటి..? రానున్న స్థానిక సంస్థల నాటికైనా పార్టీలో ఉత్తేజం నింపేందుకు కనీస ప్రయత్నం చేయరా..? అంటూ సగటు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు లెక్కకు మిక్కిలి సమాధానం లేని ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.




### స్పందించకపోవడమే వ్యూహమా..?

కేడర్‌లో నానాటికీ అయోమయం, ఆందోళనా, ఆవేదన పెరిగిపోతున్నా ఆ పార్టీ అధిష్టానం కానీ, కోటరి నాయకులు కానీ పట్టించుకోకుండా "దుంగమీద వాన కురిసింది" అన్నట్లు మౌనంగా కాలం వెళ్లదీస్తున్నారు. ఈ నేపథ్యంలో నెటిజన్ల విమర్శల పర్వం, అధికార పక్షం నుంచి గేలిమాటలు, ఎద్దేవా ఎక్కువౌతుండడంతో కార్యకర్తలను, కిందిస్థాయి నాయకులను సమాధాన పరిచేందుకు అగ్రనాయకత్వం శాంతివచనాలు వల్లిస్తూ "మన టైం కోసం ఎదురుచూడండి.. ఇప్పటికే కూటమొచ్చి ఏడాదిన్నర అయ్యింది, మరో ఏడాదిన్నర తర్వాత చూద్దాం, అప్పటివరకు కిమ్మనకుండా మౌనం పాటిద్దాం, చివర్లో పాదయాత్ర చేద్దాం, జనం ముందుకు వెళ్దాం" అంటూ సంకేతాలిస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలో ఏం జరిగినా ఎవరేమన్నా, ఎన్ని విమర్శలు వచ్చినా మనల్ని కాదులే అన్నట్లుగా చూసీచూడనట్లు ఉండాలని నాయకులకు తాడేపల్లి నుంచి తాజాగా వర్తమానం అందినట్లు ప్రచారం సాగుతోంది. అయితే, అదే నిజమైతే ఇప్పటికే కునారిల్లుతున్న పార్టీ మరింతగా ప్రజల్లో

2లో








# భారతీయ సంస్కృతికి ప్రతీక 'దసరా'

భారతీయ సంస్కృతిలో పండగలకు అధిక ప్రాధాన్యం ఉంది. అలాంటి పండుగల్లో అత్యంత విశిష్టమైంది దసరా. ప్రకృతి సంబరాన్ని, ఉత్సాహాన్ని, ఆధ్యాత్మిక చైతన్యాన్ని మోసుకొచ్చే పండుగ దసరా. సమాజంలోని అన్ని వర్గాలను అలరించే పండగ దసరా. పిల్లకు ఈ పండుగ చాలా ఇష్టం. స్త్రీలు ఈ పండుగకు చాలా ప్రాధాన్యం ఇస్తారు. మహాలయ అమావాస్యతో ఈ ఉత్సవాలు ప్రారంభం అవుతాయి. వినాయక చవితి తర్వాత వచ్చే విశిష్ట పండగ విజయదశమి. పిల్లలకు ఆనందాన్నిచ్చే పప్పు బెల్లాలు, పులివేషాలు, బాణాసంచా ఈ పండుగ విశేషాలు.

ఈ పండుగ కాలంలో కనకదుర్గమ్మ కనక వర్షం కురిపిస్తుందని వ్యాపారస్తుల విశ్వాసం. ఆధ్యాత్మిక జిజ్ఞాసువులకు శరన్నవరాత్రి ఉత్సవాలు కొత్త సంకల్ప బలాన్నిస్తాయి. దుర్గను శ్రద్ధగా పూజించే ఆధ్యాత్మిక గురువులందరూ తొమ్మిది రోజుల పాటు ఈ నవరాత్రి ఉత్సవాలను ఆచరిస్తారు. అందరి ఆకాంక్షలను తీరుస్తూ అందరికీ శుభాశీస్సులు అందిస్తూ అమ్మవారు ఈ తొమ్మిది రోజులు తొమ్మిది రూపాలుగా భక్తులకు దర్శనమిస్తుంది. ఇదే మాసంలో తిరుమలపై శ్రీ వేంకటేశ్వరస్వామికి బ్రహ్మోత్సవాలు, తెలంగాణలో 'బతుకమ్మ పండుగ'లు జరుగుతాయి.

మొక్కవోని భారతీయ సంస్కృతికి, విశిష్టతకి నిదర్శనం విజయదశమి. దేశంలో కాశ్మీరు నుండి కన్యాకుమారి వరకు ఈ పండుగ వేలాది ఏళ్లగా వైభవంగా జరుగుతూ వుంది. పశ్చిమ బెంగాల్‌లో దుర్గా ఉత్సవాలను సంబరంగా ఆచరిస్తూ వుంటారు. గుజరాతీలు దాండియా నృత్యంతో ఆనంద తాండవం చేస్తారు. మార్కండేయ పురాణంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఆచరించే విధానం వివరంగా ఉంది. దేవీ భాగవతంలో దేవీ మహాత్మ్యం విపులంగా ఉంది. అష్టాదశ పురాణాల్లో జగజ్జనని, జగన్మాత, సకల శక్తిస్వరూపిణి గురించి వర్ణనలు, కథాంశాలు ఉన్నాయి. నయనాదేవి, చింతపూర్ణి, జ్వాలాముఖి, వజ్రేశ్వరి, వైష్ణవీదేవి, చాముండేశ్వరిదేవి, మానసా దేవి, శాకాంబరి, కాళికాదేవి వంటి క్షేత్రాలు అమ్మవారి విశిష్టతకు చిహ్నాలు. శ్రీశైలం, ఉజ్జయిని, చిత్రకూటం, గయ, కాశి, కాశ్మీర్ మొదలైన అష్టాదశ పీఠాలున్నాయి.

దసరా రోజున జమ్మిని పూజించటం, పాలపిట్టను దర్శించటం, ఆయుధపూజను చేయడం మన సాంప్రదాయం. ఉత్తరగోగ్రహణ సందర్భంలో కౌరవులపై యుద్ధానికి పోతూ అర్జునుడు జమ్మి చెట్టు మీదనున్న తన ఆయుధాలను తీసుకొని వెళ్లాడని మహాభారత కథ చెప్తోంది. అందుకే ఆయుధపూజా విధానం అమలులోకి వచ్చిందని చెప్తుంటారు. లోక కంటకుడైన దశకంఠుడిని శ్రీరాముడు తుదముట్టించి, ప్రజలకు రక్షణ కల్పించిన రోజు దసరా పండుగ కూడా. పరాశక్తి దనుజ సంహారం చేసిన సందర్భం దసరా అని తెలిసిందే.

ఇక 'దసరా' విశేషాలను చారిత్రకంగా గమనిస్తే, వర్షాలు తగ్గు ముఖం పట్టి, వాతావరణం శరత్ ఋతు శోభతో అలరిస్తుంటుంది. కాబట్టి ఛత్రపతి శివాజీ సైనికులు దసరా వరకు వ్యవసాయ పనులు చూసుకుంటూ, తర్వాత యుద్ధాలకు వెళ్లడానికి సిద్ధంగా ఉండేవారట.

విజయనగర రాజులు నవరాత్రి ఉత్సవాలను మహా వైభవంగా నిర్వహించేవారు. శస్త్రాస్త్రాల, ఛత్రచామర, హస్తి, అశ్వ, మకుట, సింహాసన పూజలు జరిగేవి. చక్రవర్తి ప్రజల యోగక్షేమాలు విచారించేవాడు. ప్రజల మనోరంజనార్థం వివిధ వినోదాలు జరుపబడేవి. సామంతులు చక్రవర్తికి కానుకలర్పించేవారు. నర్తకీ మణులు నాట్యాలు ప్రదర్శించేవారు. మల్లులు మల్లయుద్ధం ప్రదర్శించేవారు. సూర్యుడస్తమించాక కాగడాలు వెలిగేవి. రథాలు, ఏనుగులు, గుర్రాలు, బ్రాహ్మణులు, సేవికలు వరుసగా ఊరేగింపులో పాల్గొనేవారు. ఈ ఉత్సవాలను తిలకించిన విదేశీ యాత్రికులు ఆశ్చర్యపోయేవారట! ఈ వైభవం గురించి అబ్దుల్ రజాక్ అనే చరిత్రకారుడు సమగ్రంగా వివరించాడు.

మైదానంలో చక్రవర్తి సింహాసనం తొమ్మిదో అంతస్థులో వుండేదట. ఆ సింహాసనం స్వర్ణమయమై రత్నాలతో నిండి వుండేది. వేషగాళ్ల వినోదాలు, గారడీగాళ్ళ ప్రదర్శనలు, నర్తకుల నర్తనలు చక్రవర్తి ఎదుట ప్రదర్శింపబడేవి. చక్రవర్తి రాయలవారు తన సామంతులను, నాయకులను ఆప్యాయంగా పలకరించి, ప్రజాసంక్షేమాన్ని గురించి చర్చించి, వారిచ్చిన కానుకలు స్వీకరించేవాడట.

నాటి నుండి నేటివరకు 'దసరా' ఒక ప్రత్యేక పండగగా అలరారుతూనే ఉంది. విద్యుద్దీపాలంకరణతో, బాణాసంచా మోతలతో ప్రతి గ్రామం, ప్రతి వీధిలో శోభాయమానంగా నిర్వహించబడుతూ 'సంస్కృతి'ని కాపాడుతూ 'భక్తి', 'శక్తి', 'ముక్తి'ల త్రివేణీ సంగమంగా భారతీయులను అనాదిగా పురోగమనంలో ఉంచుతూనే ఉంది.

మైసూరు, విజయవాడ లాంటి చోట్ల జరిగే దసరా వైభవాలకు సాటిలేదేమో! 'యాదేవీ సర్వభూతేషు, శక్తి స్వరూపేణా సంస్థితే, నమస్తస్యై, నమస్తస్యై, నమోనమః'. సకల జీవరాశులలో భగవత్ అంశగా ఉన్న అమ్మ దుర్గాదేవిని ఈ నవరాత్రి రోజుల్లో భక్తితో పూజించి తరిద్దాం!

**- డా. గంగిశెట్టి శివకుమార్**

# మూడేళ్ళు మౌనముద్ర.. ఆ తరువాత పాదయాత్ర

(మొదటిపేజీ తరువాయి)


పలుచునయ్యే ప్రమాదం ఉందని విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలకు మంగళం పలికినట్లేనా..?

ఇటీవల జరిగిన పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు డిపాజిట్లు కూడా రాకపోవడం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ క్రమంలో అధినేత సొంత నియోజకవర్గంలోనే పరిస్థితి ఇలా ఉంటే, ఇక స్థానిక సంస్థల ఎన్నికలు వస్తే రాష్ట్రవ్యాప్తంగా కూటమి పార్టీలు చండప్రచండంగా రెచ్చిపోయే అవకాశం ఉందని, దీంతో వారిని అడ్డుకోవడం శక్తికిమించిన పనే అని వైఎస్సార్‌సీపీ కేడర్ కూడా ఓ నిర్ణయానికి వచ్చినట్లు కనిపిస్తోంది. అందుకే సమన్వయ సమావేశాలంటూ విజయవాడ పార్టీ ఆఫీస్ నుంచి ఫోన్లకు సందేశం వచ్చినా, వాటిని చాలామంది లైట్ తీసుకుంటున్నట్లు వినిపిస్తోంది. పార్టీ అధికారంలో ఉన్నప్పుడు తమను పట్టించుకోలేదని, కనీసం అధినేత అపాయింట్‌మెంట్ కూడా దక్కలేదని.. ఇప్పుడు మాత్రం సొంత ఖర్చులతో నియోజకవర్గాలు తిరగమంటే ఎలా..? కేసులైతే మీరు కాపాడుతారా..? అని కొన్ని ప్రాంతాల నాయకులు అధిష్ఠానం పెద్దలను పరోక్షంగా ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. దీంతో ఇప్పుడున్న పరిస్థితుల్లో కొన్నాళ్లు, కాదు... కాదు కొన్నేళ్లు సబ్బుగా ఉండడమే నయమని, ఒత్తిడి చేస్తే ఈ మాత్రం రెస్పాన్స్ కూడా నియోజకవర్గ స్థాయి నాయకుల నుంచి వచ్చే పరిస్థితి కనిపించడం లేదని జగన్ తన కోటరీలో కీలకంగా వ్యవహరించే ఓ నాయకుడి వద్ద ప్రస్తావించినట్లు విశ్వసనీయ సమాచారం. ప్రస్తుతం ఈ వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమవుతోంది. ఒకవేళ నిజంగా వైఎస్సార్‌సీపీ అధినేత ఇదే స్ట్రాటజీని అమలు చేస్తే, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలను పువ్వుల్లో పెట్టి కూటమి ప్రభుత్వానికి మనమే అప్పజెప్పేసినట్లు అవుతుందేమో అని సదరు నాయకుడు అధినేత ముందు తన సందేహాన్ని వెలిబుచ్చినట్లు కూడా తాడేపల్లి వార్త.

## బుక్‌లెట్‌లతో ముందుకెళ్దామా..?

చంద్రబాబు ప్రభుత్వ పాలన రెండో ఏడాదికి చేరిన నేపథ్యంలో ఇప్పటి వరకు జరిగిన తప్పులు, వచ్చిన విమర్శలు, వివాదాస్పద అంశాలను సమీకరించి వాటిని ఓ బుక్‌లెట్ రూపంలో సర్క్యులేట్ చేయాలని కూడా వైఎస్సార్‌సీపీ అధిష్ఠానం యోచిస్తున్నట్లు తెలిసింది. ఇందులో లిక్కర్ షాపుల కేటాయింపులో అక్రమాలు, ఎమ్మెల్యేల పర్సంటేజీ వ్యవహారాలు, మెడికల్ కాలేజీలను పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ) మోడల్‌లో తమ అనుయాయులకు కట్టబెట్టడం, యూరియా కొరతతో అన్నదాత ఇక్కట్లు, వర్షాలతో దెబ్బతిన్న పంటలు, రోడ్లు, పెరిగిపోతున్న రాష్ట్ర అప్పులు, పెడుతున్న అక్రమ కేసులు వంటి విషయాలకు ప్రాధాన్యం ఇవ్వాలని, అదే సమయంలో సోషల్ మీడియాను బలోపేతం చేసి మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేద్దామంటూ ప్రణాళికలు రచిస్తున్నట్లు సమాచారం. తద్వారా కూటమి ప్రభుత్వ తప్పులపై ప్రజలకు అవగాహన కల్పించాలని భావిస్తున్నట్లు అత్యంత విశ్వసనీయంగా తెలిసింది. ఇందులో భాగంగానే సెప్టెంబర్ 24వ తేదీ బుధవారం నాడు తాడేపల్లిలో జరిగిన పార్టీ విస్తృత స్థాయి




సమావేశంలో “డిజిటల్ బుక్ జగనన్న 2.0” పేరుతో ఒక యాప్‌ని కూడా విడుదల చేశారు. అన్యాయానికి గురవుతున్న వైసీపీ కార్యకర్తల కోసమే ఈ యాప్ అంటూ ప్రచారం చేస్తున్నారు.

## చివరి రెండేళ్లలో రెండో పాదయాత్ర?

ఇక చంద్రబాబు పాలన చివరి రెండేళ్లు లేదా ఏడాదిన్నర సమయంలో క్షేత్రస్థాయి ప్రత్యక్ష పోరాటాలకు వెళ్లాలని జగన్ భావిస్తున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది. అప్పటివరకు కూటమి ప్రభుత్వం అమలు చేయని సూపర్‌సిక్స్ పథకాలతో అజెండాను రూపొందించి ప్రజల ముందు చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ను దోషులుగా నెలబెట్టాలని జగన్ యోచిస్తున్నట్లు వైసీపీ కీలక నాయకులు కొందరు వ్యాఖ్యానిస్తున్నారు. అదే సమయంలో కేంద్రంలోని బీజేపీ పెద్దలతో సమన్వయంతో పాటు, ఇతర రాష్ట్రాల్లో గతంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి సన్నిహితంగా మెలిగిన నేతలతో సంప్రదింపుల కోసం ఓ కమిటీని కూడా ఏర్పాటు చేయాలని జగన్ యోచిస్తున్నట్లు చెప్తున్నారు. అయితే ఈ విషయంలో లిక్కర్ స్కాంలో రిమాండ్ ఖైదీగా ఉన్న ఎంపీ మిథున్‌రెడ్డి బెయిల్‌పై విడుదల అయిన తర్వాతే ముందడుగు పడే అవకాశం ఉన్నట్లు కూడా భోగట్టా.

## మరోసారి ప్రజలు నమ్ముతారా..?

తన తండ్రి దివంగత డాక్టర్ రాజశేఖరరెడ్డి చేపట్టిన ప్రజా ప్రస్థానం పాదయాత్ర స్ఫూర్తిగా, అత్యంత సుదీర్ఘంగా 'ప్రజాసంకల్ప యాత్ర' పేరుతో పాదయాత్ర చేసి అధికారంలోకి వచ్చిన జగన్, మరోసారి అదే వ్యూహాన్ని ఎంచుకుంటున్నట్లు తెలిసింది. గత ఎన్నికలకు ముందు ఎన్ని అడ్డంకులు ఎదురైనా, లోకేశ్ తన 'యువగళం' పాదయాత్రతో ముందుకెళ్లి సక్సెస్ అయ్యారని, పైగా సొంత ఇమేజ్‌ను పెంచుకుని ఏకంగా ప్రధాని మోదీ నుంచి ప్రత్యేక అభినందనలు సైతం అందుకున్నారని.. ఇదే మార్గాన్ని జగన్ కూడా అవలంభించనున్నారని ఆ పార్టీ కీలక నేత ఒకరు స్పష్టం చేయడం గమనార్హం. అయితే, గతంలో రాజశేఖర్‌రెడ్డి కుమారుడిగా, కొత్త పార్టీ అధినేతగా జగన్ పాదయాత్ర చేశారని, కానీ ఇప్పుడు మాజీ సీఎం హోదాలో మాత్రమే జనంలోకి వెళ్లాల్సి ఉంటుందని, ఈ నేపథ్యంలో ఎంతవరకు ఈ వ్యూహం సక్సెస్ అవుతుందో చెప్పలేమని కూడా సదరు నేతే వ్యాఖ్యానించడం ఇక్కడ గమనార్హం. ఎందుకంటే గతంలో జగన్‌మోహన్ రెడ్డికి ఒక అవకాశం ఇద్దాం, ఆయన పాలన కూడా ఓసారి చూద్దాం.. అని సగటు ఆంధ్రుడు భావించాడు. అప్పట్లో ప్రభుత్వ ఉద్యోగులు కూడా ఆ వాదానికి జతకలిశారు. కానీ, తన ఐదేళ్ల పాలనలో చిత్ర విచిత్ర నిర్ణయాలు, తన విద్వాదపు వ్యవహార శైలితో జగన్ ఇమేజ్ భారీగా డ్యామేజ్ అయ్యింది. పైగా కేసుల విషవలయం ఎలాగూ వుంది.

ఈ క్రమంలో ప్రజలు జగన్‌మోహన్ రెడ్డిని, ఆయన మూడేళ్ల తర్వాత చేసే పాదయాత్రను నమ్ముతారా లేదా అన్న విషయాన్ని మనం భవిష్యత్ రాజకీయ తెరపై చూడాల్సిందే..!

## మరో 4 వారాలకు వాయిదా పడిన జగన్ ప్రతిపక్ష హోదా పిటిషన్

ప్రతిపక్ష నేత హోదా ఇప్పించాలని హైకోర్టులో జగన్ రెండోసారి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణని 25వ తేదీ బుధవారం నాడు విచారణకి రాగా, హైకోర్టు ఈ కేసుని నాలుగు వారాలకి వాయిదా వేసింది. జగన్ తన ప్రతివాదులుగా పేర్కొన్న స్పీకర్, అసెంబ్లీ సెక్రటరీ, అసెంబ్లీ వ్యవహారాల మంత్రులు కౌంటర్ దాఖలు చేయాలని సూచిస్తూ... న్యాయమూర్తి తదుపరి విచారణని 4 వారాలకు వాయిదా వేశారు. జగన్ గతంలో కూడా ఇలాంటి పిటిషన్ దాఖలు చేశారు. అది పెండింగ్‌లో ఉండగానే మళ్లీ మరో పిటిషన్ వేయడం గమనార్హం. తనపై అనర్హత వేటు వేయకుండా న్యాయపోరాటం చేస్తున్నామని ఓ కారణం చూపడానికి ఈ పిటిషన్లు వాడుకోవడానికి అన్నట్లుగా జగన్ వ్యూహం కనిపిస్తోందని విశ్లేషకులు అంటున్నారు. తన అభ్యర్థన ఓ వైపు కోర్టులో ఉన్నా తనపై అనర్హత వేటు వేశారని చెప్పుకోవడానికి పనికి వస్తుందన్నట్లుగా ఆలోచించి జగన్‌మోహన్‌రెడ్డి వ్యూహం పన్నుతున్నట్లు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



## టీటీడీ ఉత్తర భారత దేశ స్థానిక సలహా మండలి

# అధ్యక్షుడిగా సుమంత్‌రెడ్డి

- **స్వామివారి సేవలో మరో నెల్లూరీయుడు**

తిరుమల తిరుపతి దేవస్థానాల ఉత్తర భారత విభాగ స్థానిక సలహా మండలి అధ్యక్షుడిగా ఏడుగుండ్ల సుమంత్‌రెడ్డిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నియమించింది. గతంలో ప్రస్తుత కోవూరు శాసనసభ్యురాలు, టీటీడీ పాలకమండలి సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కూడా ఈ హోదాలో తమ సేవలందించారు. నెల్లూరుజిల్లా కోవూరు నియోజకవర్గం, విడవలూరు మండలం, తుమ్మగుంట సుమంత్‌రెడ్డి స్వగ్రామం. సుమంత్ విద్యార్థి దశలో అఖిలభారత విద్యార్థి పరిషత్(ఏబీవీపీ)లో చురుకుగా ఉండేవాడు. మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డికి సుమంత్ అత్యంత ఆప్తుడు. 8 సంవత్సరాల పాటు నెల్లూరుజిల్లా కో-ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంస్) అధ్యక్షుడిగా సుమంత్ సమర్థవంతమైన సేవలు అందించాడు. అనంతరం హిందూ సనాతన ధర్మం పట్ల ఆకర్షితుడై ఆధ్యాత్మిక కార్యక్రమాలపై దృష్టిపెట్టి కృషి చేయడం ప్రారంభించాడు. ఈ తరుణంలోనే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుమంత్‌రెడ్డిని టీటీడీ ఉత్తర భారత సలహా మండలి అధ్యక్షుడిగా నియమించింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని సుమంత్ సెప్టెంబర్ 24వ తేదీ, బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని కలిసి ధన్యవాదాలు తెలిపారు. స్వామివారి సేవ చేసుకునే అదృష్టాన్ని తనకి కల్పించినందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకానికి తన శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని మాటిచ్చారు. సుమంత్‌కి 'లాయర్' అభినందనలు.



## విద్యుత్‌శాఖ ఎస్ఇగా..రాఘవేంద్రం

జిల్లా విద్యుత్‌శాఖకు కొత్త ఎస్ఇగా కొండూరు రాఘవేంద్రం నియమితులయ్యారు. సత్యసాయి జిల్లాలో పనిచేస్తున్న ఆయన ఉద్యోగోన్నతిపై నెల్లూరులో ఎస్ఇగా ఈనెల 24న బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఉన్న విజయన్ తిరుపతి విద్యుత్‌శాఖ జీఎంగా నియమితులయ్యారు.

## ఇరుకళలమ్మ దేవాలయంలో..నవరాత్రి వైభవం



నవరాత్రి వేడుకల సందర్భంగా నెల్లూరు చెరువు గట్టుపై వెలసివున్న సింహపురి గ్రామ దేవత.. మహాశక్తి స్వరూపిణి శ్రీ ఇరుకళలమ్మవారి దేవాలయం విద్యుద్దీపాలతో శోభాయమానంగా ఉంది. నిత్యం అమ్మవారికి పూజలు, సేవలు చేస్తున్నారు. అలంకారాలలో భాగంగా ఈనెల 24న ఇరుకళలమ్మ వారు గజలక్ష్మీ దేవిగా నేత్రపర్వంగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మెన్ ఒట్టూరు సురేంద్రయాదవ్, కార్యనిర్వహణాధికారి వి.గిరికృష్ణ, ఆలయ కమిటీ సభ్యుల సారధ్యంలో నవరాత్రి వేడుకలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి.

## శ్రద్ధాంజలి



**కేసవరపు గిరిజమ్మ**

ఈతముక్కల

జననం : 24-06-1956 నిర్యాణం : 25-09-2025

ఆ పవిత్రమూర్తికి భాష్పాంజలి ఘటిస్తూ...



తుంగా కుటుంబం




లాయర్
సెప్టెంబర్ 26, 2025

# మురుగు మడుగులుగా మారుతున్న..మన నదులు!

జలం ఉంటేనే జీవజాతులకు బలం. ఆ జలానికి నదీ నదాలే ఆధారం. జలజలమంటూ జాలువారే జీవజలాలతో, ప్రకృతి ప్రసాదించిన అపూర్వ జలనిధులతో ఒక్క మానవుడే కాదు, ఈ భూ మండలంలోని సకల జీవరాశులూ మనుగడ సాగిస్తున్నాయి. పంచభూతాల్లో నీరు కూడా ఒకటి. గాలి లేకుంటే ఎలా బతకలేమో, నీరు లేకున్నా అంతే. వాన జల్లులతో పుడమి పులకరించి, ఆ జలధారలే నదులుగా ఆవిర్భవించి మానవునితో పాటు సకల జీవులకీ జీవం పోస్తున్నాయి. అందుకే భారతీయ సంస్కృతిలో నదులకు ఎంతో పవిత్రమైన, పరిశుద్ధమైన స్థానం ఉంది. నదులను నదీమతల్లులుగా ఆరాధించడం కూడా మనకు ఆనవాయితీ. నదీస్నానం పుణ్యప్రదం. నదులన్నీ కలసి కదిలి సాగరానికి చేరుతుంటాయి. నదీసంగమ స్థానాలను దర్శించుకోవడం కూడా ఎంతో శుభప్రదం. నదీ పుష్కరాల రోజుల్లో, ఆయా నదుల్లో భక్తితో నాలుగు మునకలు వేస్తే చాలు, ముక్తి కలుగుతుందని ప్రాచీనశాస్త్రాలు చెప్తున్నాయి. అంతేకాదు, పవిత్రమైన నదీజలాలతో దేవాలయాల్లో కొలువై ఉన్న భగవంతుని మూలమూర్తులను సైతం అభిషేకిస్తుంటారు. నేటికీ గంగ, యమున, కావేరీ, కృష్ణ, గోదావరి, తుంగభద్ర, పెన్నా వంటి అనేక నదులు ఆయా ప్రాంతాల్లో లక్షలాది మంది జనుల దాహార్తి తీరుస్తున్నాయి. ఎన్నో రకాలుగా నదీజలాలు ఉపకరిస్తున్నాయి. మరోవైపు నదుల్లోంచి జలవిద్యుత్ కూడా తయారై అనునిత్యం మానవాళికి విద్యుత్ వెలుగులను కూడా ప్రసాదిస్తున్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే, నదీమతల్లులు మనకు దేవతా స్వరూపాలు. నదులు మనం తాగేందుకు పరిశుభ్రమైన నీరందిస్తున్నాయి. ఆ నీళ్ళే మన ప్రాణం నిలబెడుతున్నాయి. పంటలు పండించేందుకు అపారమైన సాగునీటినీ సమకూరుస్తున్నాయి. నదులున్న ప్రాంతాలన్నీ భూగర్భజలాలకు కొదవ లేకుండా పచ్చని చెట్లతో, చల్లని ప్రశాంత వాతావరణంతో అలరారుతుంటాయి. నదుల్లో లభించే మత్స్యసంపద వగైరాలు ఎంతో మందికి జీవనోపాధి. నదులు రవాణా రంగానికి ఎంతో ముఖ్యమైనవి కూడా. అయితే, ఇంతటి పరమ పవిత్రమైన నదులు రానురాను మానవుని స్వార్థానికి బలైపోతుండడమే బాధాకరం. ఒక్క మనదేశంలోనే కాదు, ప్రపంచంలోని అన్నిదేశాల్లోనూ ఈ దుస్థితి ఎంతోకాలం నుంచి ఉంది. ఏ నదిని చూసినా ఏమున్నది గర్వకారణం..ఎక్కడ చూసినా చెత్తాచెదారం, కాలుష్యమే కదా అన్నట్లుగా తయారైంది. మన దేశంలోనూ వందలాది నదులు కాలుష్యపు కోరల్లో చిక్కుకుని పోయాయి. నగరాలు, పట్టణాలు, గ్రామాలు ఎక్కడైనా సరే.. నది ఉందంటే, దానిని కలుషితం చేసేస్తున్నారు. ఆయా ప్రాంతాల్లోని మురుగునీటికీ నదులే ఒక డంపింగ్‌యార్డులుగా ఉంటున్నాయంటే అతిశయోక్తి కాదు. ఆ దుర్గంధం చాలదన్నట్లు, పరిశ్రమల నుంచి వెలువడే ప్రమాదకరమైన రసాయనాల వ్యర్థాలన్నీ నదుల్లోకి వచ్చేస్తున్నాయి. మానవ, జంతు కళేబరాలతో మరికొన్ని నదులు దుర్వాసనతో నిండిపోతున్నాయి. ఎక్కడెక్కడి మురుగునంతా కాలువలు తీసి నదుల్ని మురికికూపాలుగా చేస్తున్నారు. గబ్బుకొట్టిపోయే వ్యర్థపదార్థాలన్నిటినీ నదులనీటిలో కలిపేస్తున్నారు. అమృతం లాంటి నదుల జలాలు ఇలా విషపూరితం అవుతుండడంతో లేనిపోని రోగాలు కూడా మనిషికి ప్రాప్తించడమే కాక, ఆయా నదుల్లో జీవించే అనేకరకాల జీవజాతులు ఆ రోగాల నీటిలో బతకలేక ప్రాణాలు కోల్పోతున్నాయి. ఆయా ప్రాంతాల్లో ఉన్న నాయకులు కానీ, పాలకులు కానీ ఈ సమస్యలను పెద్దగా పట్టించుకోకపోవడంతో నదుల్లో, నదీపరీవాహక ప్రాంతాల్లో మురుగు పేరుకుపోతూనే ఉంది. చెప్పుకోవడానికి చట్టాలెన్ని ఉన్నా, నదుల్లో కాలుష్యం మాత్రం పెరిగిపోతూనే ఉంది. ఇకనైనా ఈ దుస్థితి పోవాలి. మన నదుల్ని మనమే సంరక్షించుకోవాలి. నదుల్నీ, పర్యావరణాన్ని, జీవ వైవిధ్యాన్ని రక్షించుకోవాలి. నదుల పరిరక్షణకి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మరిన్ని ప్రణాళికలు రూపొందించి, వాటి అమలుకు మరింత కఠినచట్టాలు తేవాలి. మురుగునీటిని, వ్యర్థాలను నదుల్లో వదిలేవారిపై చర్యలు తీసుకోవాలి. పారిశ్రామిక రసాయన వ్యర్థాలు మరింత చేటు తెస్తాయి కనుక, అవి నదుల్లో కలవకుండా ఎక్కడికక్కడ కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలి. మానవ నాగరికతకు, సమాజ వికాసానికి మూలస్థానాలైన మన నదీమతల్లులు ఎప్పటికీ పవిత్రంగానే ఉండేలా అందరూ శ్రద్ధ తీసుకోవాలి. ప్రభుత్వాలతో పాటు, ప్రజలు కూడా.. ప్రతిఒక్కరూ సహకరించి .. ఎక్కడైనా సరే నదులను కలుషితం కాకుండా కాపాడుకోవాలి. ఇది అందరి బాధ్యత కూడా!....

**.... (సెప్టెంబరు 28.. ప్రపంచ నదుల దినోత్సవం)**

# ప్లాస్టిక్ మూలాలని నిర్మూలించాలి!




ప్లాస్టిక్‌ని పూర్తిగా నిర్మూలించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విశేషంగా కృషి చేస్తున్నాయి. ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాయి కూడా. ఈ విషయంలో ప్రభుత్వాలకి, ముఖ్యంగా మున్సిపల్ కమిషనర్లకి మరియు కార్పొరేషన్ల సిబ్బందికి నాది ఒకటే మనవి. జనాన్ని ప్లాస్టిక్ వాడనీయకుండా చేయాలనే గట్టి సంకల్పంతో మీరు కృషి చేస్తున్నారు, మంచిదే. అయితే, అది మీరనుకున్నంత సులభం కాదు. ఆ విషయం కూడా మీకు తెలుసు. మీరు చిన్న చిన్న వ్యాపారస్తుల మీద దాడి చేసి, ఫైన్ల పేరుతో వాళ్ళని వేధించడం సబబు కాదు. అసలు ఆ ప్లాస్టిక్ కవర్లని తయారు చేసి బహిరంగ మార్కెట్లోకి సరఫరా చేస్తున్న సంస్థల్ని మీరు గుర్తించండి. ఆ ఫ్యాక్టరీలకి సీలువేసి మూసేయండి. అవసరమైతే ప్రభుత్వాల నుండి వాళ్లకి నష్టపరిహారం ఇప్పించి, ప్లాస్టిక్ కవర్లని తయారు చేసే యంత్రాలని స్క్రాప్ కింద నిర్వీర్యం చేయండి. అప్పుడు ఖచ్చితంగా మంచి ఫలితాలు వస్తాయి. అంతే తప్ప మీరు ఎన్నిసార్లు రైడ్‌లు చేసి ఫైన్లు విధించినా వ్యాపారస్తులలో మార్పు రాదు. అసలు ఇలాంటి ఫ్యాక్టరీలకి లైసెన్సులు మంజూరు చేసేటప్పుడే వాటిని అడ్డుకోవాలి. ప్రభుత్వాలే అనుమతులు ఇచ్చి మళ్ళీ ఆ ప్రభుత్వాలే బ్యాన్ చేస్తే వ్యాపారులు అమితంగా నష్టపోతారు. ఇప్పటికైనా మించిపోయింది లేదు, మూలాలని వెతికి కూకటి వేళ్ళతో సహా పెకిలించి పెరికేయండి, అప్పుడు తప్పకుండా మంచి ఫలితాలు వస్తాయి.

**జీ.వీ.సుబ్బయ్య - పిడుగురాళ్ళ.**

# నెల్లూరుకు ఎయిర్‌పోర్టు చాలా అవసరం!

మన నెల్లూరుజిల్లాకి అంతర్జాతీయ ఖ్యాతి ఉంది. అనేకమంది నెల్లూరోళ్ళు వివిధ రంగాలలో తమ ప్రతిభ చాటుతున్నారు. భారతదేశంలోనే కాకుండా దశ దిశలా విస్తరించి ప్రపంచ వ్యాప్తంగా రాణిస్తున్నారు. మన నెల్లూరు కీర్తిని రెపరెపలాడిస్తున్నారు. అలాంటి మన నెల్లూరుకు ఇప్పటివరకూ విమానాశ్రయం లేకపోవడం తీరనిలోటే. గతంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శంఖుస్థాపన చేసినప్పుడే నెల్లూరీయుల ఆశలు నెరవేరుతున్నాయని సంబరపడ్డాం. ఆ తరువాత జగన్‌రెడ్డి ఆ ఆశలని అడియాశలు చేసి నిరుత్సాహపరచారు. ఇప్పుడు మళ్ళీ ఎయిర్‌పోర్టు ప్రతిపాదన తెరమీదకి వచ్చి పనులలో పురోగతి సాధించడం సంతోషదాయకం. రాబోవు రెండు మూడేళ్ళలో నెల్లూరు విమానాశ్రయం అందుబాటులోకి వస్తుందని ఆశిద్దాం! **- పీ.ఎస్.రెడ్డి, యు.ఎస్.ఏ.**

# జనంతో కళకళలాడుతున్న ఎన్టీఆర్ పార్కు!

నగరంలోని మినీ బైపాస్ అన్నమయ్య కూడలిలోని ఎన్టీఆర్ పార్కు ఇప్పుడు ఉదయం సాయంత్రం వందలాది మంది జనంతో కళకళలాడుతోంది. పిల్లలు, పెద్దలు, నడక ప్రియులు ఆహ్లాదం కోసం ఈ పార్కుకి వస్తున్నారు. ఎప్పుడో గత ప్రభుత్వంలో ప్రారంభం కావలసిన ఈ పార్కుకి రాజకీయ గ్రహణం పట్టి ఐదేళ్ళు మూతబడిపోయింది. ఇన్నాళ్ళకి మళ్ళీ టీడీపీ ప్రభుత్వంలో ఆ గ్రహణం వీడడంతో పార్కు సందర్శకులు సంబరపడుతున్నారు. ముఖ్యంగా నా లాంటి సీనియర్ సిటిజన్లకి ఈ పార్కు వల్ల చాలా ఉపయోగకరంగా ఉంది. ఇన్నాళ్ళకి ఈ పార్కుకి మోక్షం కలిగించిన నేతలకి, అధికారులకి ధన్యవాదాలు. **- కే.ఆనందరాజు, ఇస్కాన్‌సిటీ.**




# మస్తిష్కం నుండి మాయమవుతున్న పుస్తకం!

నా మిత్రుడు ఒకాయనుండే వాడు. చెప్పుకోవడానికి ఆయన పెద్ద కవి, కవే కాదు మేధావి కూడా. ఇప్పుడాయన లేడు లెండి. హాయిగా సుదూరతీరాలకు తరలి వెళ్ళిపోయాడు. ఆయనకేదైనా ఓ పుస్తకాన్ని ఇచ్చామనుకోండి, థ్యాంక్స్ అంటూ తీసుకునేవాడు ఇంటికి వెళ్తూ దారిలో వుండే పాతపుస్తకాల అంగట్లో ఇచ్చేసి, ఎంతోకొంత ఇవ్వండి కొత్తది ఫ్రెష్ బుక్!.. ఇప్పుడే వచ్చింది అనేవాడు. మీరే హాయిగా ఇంటికి తీసుకువెళ్ళి చదువుకోవచ్చు కదా అంటే, "నేను కావాలో, అది కావాలో తేల్చుకోండి" అంటుందయ్యా నా భార్యామణీ, అంటూ రాగం తీసేవాడు. ఇది నిజంగా నా స్వీయానుభవం. ఇదంతా ఎందుకు చెప్తున్నానంటే, భార్యా భర్తలిద్దరూ పార్వతీపరమేశ్వరుల్లాంటి వారే అయినా, పుస్తకాలంటే మాత్రం ఒకరికి ఇష్టం మరొకరికి కష్టం. అసలు, పుస్తకాలంటేనే వొళ్ళంతా తేళ్ళూజర్రులు పారాడినట్లు కొందరు ముఖం చిట్లిస్తుంటారు. కొంత మందికి పుస్తకాలంటే అంత చులకన. పాపం, ఆ కోవకి చెందిందే ఆయన సతీమణి.

"చిరిగిపోయిన చొక్కా అయినా తొడుక్కో.....ఓ మంచి పుస్తకం కొనుక్కో" అంటుంటారు సాహితీప్రియులు. నిజంగా ఎంత గొప్ప మాట! కానీ, జేబు నిండా డబ్బులున్నా, పుస్తకాలు కొనడానికి మాత్రం చిల్లిగవ్వ కూడా లేదంటారు చాలామంది. ఇప్పట్లో ఖరీదైన పుస్తకాన్ని ఉచితంగా ఇచ్చినా చదివే వాళ్లకి కరువే, అలా ఉంది కలికాలం!. కొంతమంది పుస్తకాలని తమ షెల్ఫుల నిండా పెట్టుకుంటుంటారు కానీ, కనీసం ఒక్కసారైనా ఒక్క పుస్తకాన్నయినా తెరిచి చదవని వాళ్ళు నాకు బోలెడంత మంది తెలుసు. ఇంకొంత మందికి పుస్తకాలంటే అలర్జీ. దుమ్ము పట్టిపోతాయని, ఆ దుమ్ము తమకి పడదని చెప్పి, పుస్తకాల్ని ఇంట్లోకి రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటుంటారు. అయితే, పుస్తకం దొరికితే చాలు సంతోషంగా చదివేవాళ్లు, జాగ్రత్తగా పెట్టుకుని తమ పిల్లల చేత ఆ పుస్తకాలను చదివించేవాళ్ళూ లేకపోలేదు. ఈ ఉపోద్ఘాతమంతా అలాంటి వాళ్ల కోసం కాదు, పుస్తకమంటేనే కోపంతో కొరకొర చూసే వాళ్ళ కోసం మాత్రమే!..

## చరిత్ర ఘనమే.. కానీ చెప్పినా వినే నాథులు లేరు :

అక్షరాల పుట్టుకకి పుస్తకాలకీ పెద్ద చరిత్రే ఉందనీ, ఆ గతం తెలుసుకుంటే పుస్తకం విలువ తెలుస్తుందని చెప్పినా వినే వారెవరూ లేరు. వినేవాళ్లకి చెప్పేవారు లోకువైపోయారు. గ్రంథాలయోద్యమం ఎంతో గొప్పదని, ఒకప్పుడు పత్రికలు, పుస్తకాలు లేక చదువర్లు ఎంతో ఇబ్బంది పడేవారని కొంతమందికి చెప్పే ప్రయత్నం చేయబోయినా సారీ!.. అర్జంట్ ఫోన్ మాట్లాడాలి అంటూ చల్లగా జారుకుంటున్నారు. దేశంలో ఎప్పుడేం జరుగుతుందో తెలియక, బ్రిటీషోళ్ళ కాలంలో ఎన్నో ఇబ్బందులు పడ్డాం. అప్పట్లో నెల్లూరులో ఓ మహానుభావుడు గోడమీద వార్తలు రాసేవారు. మద్రాసు నుంచి రైల్లో వచ్చే ఇంగ్లీషు పత్రికలను కొని, వాటిని చదివి అందరికీ అర్థమయ్యేలా తెలుగులో ఆ సమాచారాన్ని ఆ గోడపత్రిక పైన రాసేవాడు. వాటిని చదువుకునేందుకు అప్పట్లో జనం గుంపులుగుంపులుగా చేరేవాళ్ళు. ఆరోజుల్లో అక్షరానికి అంత విలువుండేది. అలాంటి నెల్లూరులో నేడు గ్రంథాలయాల పరిస్థితి పరమ దయనీయంగా ఉంది. పత్రికలు, పుస్తకాలనేవి విజ్ఞాన బాండాగారాలు. ఎప్పటికప్పుడు మనల్ని చైతన్యం చేసే సరస్వతీపుత్రికలు. ఒక పుస్తకం రాయాలన్నా, దాని అచ్చు వేయించాలన్నా ఆ రచయితకి ఎంత కష్టమో, ఎంత డబ్బు ఖర్చవుతుందో ఎవరాలోచిస్తున్నారు? పుస్తకాలు ప్రింటు చేయించుకోడానికి డబ్బులేక ఇప్పటికీ ఎంతోమంది కవులు, రచయితలు డబ్బున్న దాతల్ని ఆశ్రయిస్తుంటారు. పాతకాలంలో, ఓ వంద పేజీల పుస్తకం అచ్చేయాలంటే ఓ వెయ్యో రెండువేలో ఉండేది. ఇప్పుడు కనీసం అరలక్ష, అంటే 50వేలకి పైమాటే అవుతోంది. అంత డబ్బు ఖర్చుపెట్టి పుస్తకాన్ని ముద్రించినా తూకానికి వేసుకోవాల్సిందే తప్ప కొనేవాళ్ళు లేరు. దానికి తోడు ఆవిష్కరణలకి బోలెడు ఖర్చు. పిల్లని కంటే సరిపోదు కదా, దానికి పెళ్ళి చేయొద్దూ! అందువల్ల దాన్ని ఎవరో ఒకరికి అంకితమిచ్చి, అంతో ఇంతో పైకం పుచ్చుకుని, ఆ దాతకి దండం పెట్టి కన్యాదానం లాగా పుస్తకదానం చేసుకోవాల్సిందే తప్ప మరో దారిలేదు. ఇలా చెప్పుకుంటే పుస్తకాలు రాసేవాళ్ళ కష్టాలు కొండవీటి చాంతాడంతవుతుంది!.

## నాడు పుస్తకం హస్తభూషణం.. నేడు అది శిరోభారం!..

'పుస్తకం హస్తభూషణం' అన్నారు పెద్దలు. అది గతించిన మాట. ఇప్పుడది శిరోభారం అయింది. గ్రంథాలయాలకు ఆదరణ బాగా తగ్గిపోయింది. ప్రభుత్వాలు వాటి సమస్యలను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నాయి. రాజకీయ నిరుద్యోగులకు పట్టం కట్టే నెపంతో పుస్తకం అంటే అర్థమే తెలియని వారిని గ్రంథాలయాల చైర్మన్లుగా ప్రభుత్వ పెద్దలు నియమిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా లైబ్రరీల్లో ఉండే అమూల్యమైన కోట్లాది గ్రంథాలు, పుస్తకాలు చెదలు పట్టిపోతున్నా పట్టించుకునే నాథుడే లేదు. చేతిలో ఒక పుస్తకం ఉంటే ఒక మంచి స్నేహితుడున్నట్లే అనే రోజులు పోయాయి. అలా అనేవాళ్ళని ఇప్పుడు ఆదిమానవుల్లా చూస్తున్నారు. చేతిలో ఉండాల్సింది పుస్తకం కాదు, సెల్‌ఫోన్ అంటున్నారు. అయితే ఇప్పటికీ మూలపడేసిన గంధపుచెక్కల్లాగా అక్కడక్కడా కొందరు విజ్ఞానులనేవాళ్లు ఉండనే ఉంటారు. వాళ్ల దయ వల్ల ఇంకా పుస్తకాలు బతికే ఉంటున్నాయి.

ఏదేమైనా, పుస్తకాలకి మళ్ళీ మంచిరోజులు రావాలి. సరస్వతీ నిలయాలైన గ్రంథాలయాల స్థితిగతులను ప్రభుత్వం ఇకనైనా పట్టించుకోవాలి. వాటి బాగుకు నిధులను కేటాయించాలి. గ్రంథాలయాల ద్వారా ఎన్నో పుస్తకాలు అందుబాటులోకి తేవచ్చు. వాటిని ఆసక్తిగల పుస్తకప్రియులు చదువుకోవచ్చు. పుస్తకాల ద్వారా కావలసినంత విజ్ఞానం సముపార్జించుకోవచ్చు. అందరూ కలసి అక్షరాన్ని బతికించాలి. పుస్తకాలను మనం చదువుకుంటూనే ఇతరుల చేత చదివించాలి. చిన్నతనం నుంచే పిల్లలలో పుస్తక పఠనం పట్ల ఆసక్తి పెంచాలి. తద్వారా మన భాషను మనం బతికించుకోవాలి. మంచి పుస్తకాలు మంచి సమాజానికి కరదీపికలు. ఆ విజ్ఞానపు వెలుగులు కొడిగొట్టిపోకుండా చూడాల్సిన బాధ్యత మేధావులు, సాహితీవేత్తలు, అధ్యాపకులు, అమ్మా నాన్నలు తమ భుజస్కంధాలపైకి తీసుకోవాలి...! **- రాజశ్రీ**

# అసెంబ్లీలో గళమెత్తిన నెల్లూరు నేతలు



## జూన్‌లోగా టిడ్కో ఇళ్ళు! - మంత్రి నారాయణ

వచ్చే జూన్ నెలాఖరులోపు 2,61,640 టిడ్కో ఇళ్లను పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నామని ఈనెల 20న జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో మంత్రి నారాయణ చెప్పారు. మొత్తం ఇళ్ల నిర్మాణంతో పాటు మౌళిక వసతులకు, కాంట్రాక్టర్ల పెండింగ్ బకాయిలకు కలిపి 7280 కోట్లు అవసరమవుతుందన్నారు. రాష్ట్రంలో టిడ్కో ఇళ్ల పరిస్థితి, లబ్దిదారులకు ఇళ్ల అప్పగింతపై పలువురు ఎమ్మెల్యేలు అడిగిన ప్రశ్నలకు మంత్రి నారాయణ సమాధాన మిచ్చారు. 2014-2019లో కేంద్ర ప్రభుత్వం ఏపీకి 7,01,481 ఇళ్లను కేటాయించిం దన్నారు. వీటిలో 5లక్షల ఇళ్ల నిర్మాణానికి పాలనాపరమైన అనుమతులు జారీ చేయడంతో పాటు టెండర్లు కూడా పిలిచి పనులు ప్రారంభించామన్నారు. గత ప్రభుత్వం టిడ్కో ఇళ్లలో అనేక అవకతవకలకు పాల్పడిందని మంత్రి నారాయణ ఆరోపించారు.

**శాసనమండలిలో :**

శాసనమండలి సమావేశాల్లోనూ మంత్రి నారాయణ పారి శుధ్య పరిస్థితులపై పలు ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. గత ప్రభుత్వం చెత్త పన్ను వేసినా 85 లక్షల టన్నుల చెత్తను తొలగించకుండా వదిలేసిందని, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత 84లక్షల టన్నుల చెత్తను పూర్తిగా తొలగించామని, అక్టోబర్ 2 నాటికి మరో లక్ష టన్నుల చెత్త తొలగిస్తామన్నారు. రూ.50కోట్లతో 21వేల కి.మీ డ్రెయిన్ల పూడిక తీశామని, రాష్ట్రంలో 6249 బ్లాక్‌స్పాట్‌లను గుర్తించి.. 2000 గ్రీన్‌స్పాట్‌లుగా మార్చా మన్నారు. ఘనవ్యర్థాల నిర్వహణ కోసం వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌ల ఏర్పాటుకు టెండర్లు పిలిచామని, ద్రవవ్యర్థాల నిర్వహణకు 1957 ఎంఎల్‌డీ కెపాసిటీతో ఎస్టీపీల అవసరం ఉందని తెలిపారు.

## కర్నాటక, తెలంగాణ ప్రాజెక్టులతో ఏపీ ఎడారే! - సోమిరెడ్డి



కర్నాటక, తెలంగాణ ప్రాజెక్టులతో ఏపీ ఎడారే అవుతుందని సోమిరెడ్డి అసెంబ్లీ దృష్టికి తీసుకువచ్చారు. ఆ రెండు రాష్ట్రాలు కలసి 280 టీఎంసీల నీళ్ళని మళ్లించుకునే ప్రయత్నాలు చేస్తున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అప్రమత్తమై ఏపీ హక్కులను కాపాడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కర్నాటక ప్రభుత్వం అల్మట్టి డ్యాం ఎత్తును 519 అడుగుల నుంచి 524 అడుగులకు పెంచేందుకు సన్నాహాలు చేస్తోందని, అదనంగా 130 టీఎంసీల కృష్ణా జలాలను మళ్లించుకునేందుకు ఒక లక్షా 33 వేల ఎకరాలు భూసేకరణ చేసి రూ.70వేల కోట్లు ఖర్చుపెట్టాలని అక్కడి మంత్రి వర్గంలో నిర్ణయం తీసుకున్నారని ఆయన తెలిపారు. మరోవైపు తెలంగాణ కూడా అదే సన్నాహాల్లో ఉందన్నారు. తెలంగాణ మొత్తం 16 స్కీముల ద్వారా 150 టీఎంసీలు తరలించుకుపోయే ప్రయత్నం చేస్తోందని తెలిపారు. ఆ నీళ్లపై మన హక్కులను కాపాడుకోకపోతే ఏపీలో రైతులు, సామాన్య ప్రజల భవిష్యత్తు ప్రమాదకరంగా మారే పరిస్థితి ఉంది కనుక, ఈ అంశాన్ని మన ప్రభుత్వం చాలా సీరియస్‌గా తీసుకోవాలని ఆయన సూచించారు.

**రిలయన్స్ భూముల్లో పరిశ్రమలు పెట్టేదెప్పుడు?**

ముత్తుకూరు మండలం కృష్ణపట్నంలో రిలయన్స్ కంపెనీ వారు 2007లో ఎకరా రూ.7.50 లక్షల చొప్పున 2700 ఎకరాలు తీసుకున్నారని, అయితే 18 ఏళ్లు దాటు తున్నా ఎలాంటి పరిశ్రమలు ఏర్పాటు చేయలేదని, అసలు ఆ కంపెనీ పరిశ్రమలు పెట్టగలదా...లేదా తెలపాలని సోమిరెడ్డి అసెంబ్లీలో ప్రశ్నించారు. ఇన్నేళ్లుగా రైతులు భూములను బీడు పెట్టుకున్నారని ఆయన చెప్పారు. కిసాన్‌సెజ్‌లో 2600 ఎకరాలు, కృష్ణపట్నం సెజ్ కోసం 6 వేల ఎకరాలకు పైగా భూములు సేకరించారని ఆయన తెలిపారు. ఆ భూములు బీడుగా ఉండటంతో రైతు కూలీలకు కూడా ఉపాధి లేకుండా పోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమలు ఏర్పాటు చేయని భూములను వెనక్కు తీసుకుని ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

**పేదలకు సంజీవనిలా..డయాలసిస్ సెంటర్లు**

రాష్ట్రంలోని పేదరోగులకు డయాలసిస్ సెంటర్లు సంజీవనిలా ఉంటాయని సోమిరెడ్డి అసెంబ్లీలో అన్నారు. వైద్య కళాశాలల విషయంలో వైకాపా నేతలకు మంత్రి సత్యకుమార్‌యాదవ్ ఇచ్చిన సమాధానం అద్భుతమన్నారు. ముత్తుకూరు పీహెచ్‌సీని సామాజిక ఆరోగ్య కేంద్రంగా మార్చాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తమ సర్వేపల్లి నియో జకవర్గానికి ఒక డయాలసిస్ సెంటర్ కావాలని కోరిన వెంటనే మంత్రి సత్యకుమార్ యాదవ్ మంజూరు చేశారని తెలిపారు.

## మెట్ట ప్రజలకు సురక్షిత మంచినీరు అందించాలి - ఎమ్మెల్యే కాకర్ల



నెల్లూరు జిల్లాలోని ఉదయగిరి నియోజకవర్గంలో త్రాగునీటికి ప్రజలు కటకటలాడుతున్నారని, మెట్టప్రాంత ప్రజలకు సురక్షిత మంచినీరందించాలని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అసెంబ్లీ సమావేశాల్లో కోరారు. 2018లో క్లోరిన్ బారినుండి ప్రజలను రక్షించాలని మంత్రి నారా లోకేష్ సుజల స్రవంతిని ఏర్పాటు చేశారని, ఉదయగిరి నియోజకవర్గంలోని 8 మండలాలకు అవి మంజూర య్యాయని అన్నారు. అప్పట్లో అవి చివరి దశలో ఆగిపోయాయని తెలిపారు. 8 కోట్ల రూపాయలు మంజూరు చేస్తే వెనుకబడిన మెట్ట ప్రజలకు మినరల్‌వాటర్ అందించవచ్చునని ఆయన అసెంబ్లీ దృష్టికి తెచ్చారు. ఉదయగిరి నుండి నెల్లూరు జిల్లా కేంద్రానికి, ఉదయగిరి నుండి నందవరం వరకు డబుల్ లైన్ రోడ్లను నిర్మించాలని కూడా ఆయన కోరారు.



## చంద్రన్నను కలిసిన ప్రశాంతమ్మ

అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఇటీవల అమరావతిలోని ముఖ్యమంత్రి కార్యాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కలిసి, కోవూరు నియోజకవర్గంలో పలు అభివృద్ధి అంశాలపై మాట్లాడి వినతిపత్రాలు అందజేశారు. నియోజకవర్గంలోని పెండింగ్ విషయాలను సీఎం దృష్టికి తెచ్చారు. ప్రశాంతమ్మ వినతులపై స్పందించిన సీఎం, పరిశీలించి వాటిపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

## కలిగిరి రిజర్వాయర్ క్రస్ట్ గేట్లను మార్చాలి




దాదాపు వందేళ్ళ క్రితం నుంచి ఉన్న కనిగిరి రిజర్వాయర్ క్రస్ట్ గేట్లను మార్చాలని, రిజర్వాయర్ మట్టికట్టను పటిష్టం చేయడంతో పాటు, పూడిక తీసేందుకు నిధులు కేటాయించాలని కోవూరు శాసనసభ్యురాలు ఇటీవల అసెంబ్లీలో కోరారు. ఈ రిజర్వాయర్ ఆధునీకరణకు నిధులు కేటాయించి కోవూరు, ఆత్మకూరు, కావలి నియో జకవర్గాల రైతన్నలను ఆదుకోవాలని కోరారు. అదేవిధంగా, పెన్నా నది కర కట్టలు బలోపేతం చేసి కోవూరు నియోజకవర్గాన్ని వరద ముప్పు నుంచి కాపాడాలన్నారు. ఆయకట్టు పరిధిలోని చివరి ఎకరాకు కూడా నీరు చేరేలా ఈస్ట్రన్, సదరన్, పైడేరు ఎస్కేప్ ఛానల్స్‌ను మరమ్మతులు చేయాలన్నారు. అదేవిధంగా, చరిత్రాత్మకమైన పల్లిపాడు గాంధీ ఆశ్రమాన్ని వరద కోత నుంచి కాపాడాలన్నారు.

### అన్నదాతలను ఆదుకోండి

నెల్లూరుజిల్లాలోని మిల్లర్లు రైతుల నుంచి గిట్టుబాటు ధరకు ధాన్యం కొనేలా అధికారులను ఆదేశించి అన్నదాతలను ఆదుకోవాలని ఎమ్మెల్యే ప్రశాంతమ్మ కోరారు. ధాన్యానికి గిట్టుబాటు ధర దక్కక నష్టపోతున్న కోవూరు నియోజకవర్గ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆమె ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. కోవూరు నియోజకవర్గ రైతాంగానికి వరి పంటే ఆధారమన్నారు. పుష్కలంగా నీటి వసతి ఉన్న కారణంగా రైతులు వరి పంట వేశారని, వారికి గిట్టుబాటు ధరలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

### గిరిజనులకు వెలుగుబాట వేయాలి

నేటికీ గిరిజనులు ఎంతో వెనుకబడి ఉన్నారని, వారి జీవితాలకు ప్రభుత్వం వెలుగుబాటలు వేయాలని ఎమ్మెల్యే ప్రశాంతమ్మ కోరారు. 2011 లెక్కల ప్రకారం కోవూరు నియోజకవర్గ పరిధిలో 138 గిరిజన గ్రామాలుంటే దాదాపు 45 వేల మంది జనాభా ఉన్నారని తెలిపారు. మైదాన ప్రాంత గిరిజన గ్రామాలను షెడ్యూల్ గ్రామాలుగా ప్రకటిస్తే.. ఇటు రాష్ట్ర, అటు కేంద్ర నిధులతో గిరిజన కాలనీలు అభివృద్ధికి నోచుకుంటాయని, యానాదుల జీవన ప్రమాణాలు పెంచవచ్చన్నారు. యానాది కార్పొరేషన్ ఏర్పాటు చేస్తే సీనియర్ ఐఏఎస్ అధికారుల పర్యవేక్షణలో గిరిజనులకు మెరుగైన, విద్య, వైద్యం,ఉపాధి అవకాశాలు కల్పించడానికి వీలవుతుందన్నారు. కోవూరు నియోజకవర్గంలో గిరిజన గురుకుల పాఠశాలలు ఉన్నప్పటికీ ప్రత్యేక ఇంటర్మీడియట్ మరియు, డిగ్రీ కాలేజీలు ఏర్పాటు చేయవలసిన అవసరం ఉందన్నారు.


శ్రీ షిరిడి సాయిబాబా వారి విజయదశమి మహాసమాధి మహోత్సవములు

తేది. 02-10-2025 గురువారం నుండి 04-10-2025 శనివారం వరకు

పై దినములలో ప్రతిరోజు ఉ|| 7.00గం.ల నుండి శ్రీ బాబా వారికి

మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకములు, సామూహిక సహస్రనామ, అష్టోత్తర పూజలు జరుగును.

కావున పై పూజా కార్యక్రమములలో పాల్గొనే భక్తులు మందిర గుమస్తా వద్ద రూ.300/- చెల్లించి తగిన రశీదు పొంది బాబావారి తీర్థప్రసాదములు స్వీకరించి బాబావారి కృపకు పాత్రులగుదురని కోరుచున్నాము.

ఇట్లు: కార్యవర్గం

శ్రీ షిరిడి సాయిబాబా మందిరం

గాంధీనగర్, ట్రంకురోడ్డు - నెల్లూరు. ఫోన్. 0861 - 2327771.





# శ్రీ రాజరాజేశ్వరిదేవి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు

## • వేలాదిగా తరలివస్తున్న భక్తజనం

శ్రీ దేవీ శరన్నవరాత్రి వేడుకల సందర్భంగా నెల్లూరు దర్గామిట్టలో ఉన్న శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవాలయం భక్తజనంతో క్రిక్కిరిసిపోతోంది. ప్రతిరోజూ భక్తులు, ముఖ్యంగా మహిళలు వేల సంఖ్యలో ఆలయానికి వచ్చి అమ్మవారిని భక్తితో దర్శించుకుంటున్నారు. ఈ సందర్భంగా అలయ అధికారులు ఆలయాన్ని విద్యుత్‌కాంతులు, దేవతా మూర్తుల కటౌట్లతో దేదీప్యమానం చేశారు. ఉత్సవాల్లో రెండోరోజైన మంగళశారం నాడు అమ్మవారికి శ్రీ భవాని అలంకారం నిర్వహించి పెద్దఎత్తున పూజలు చేశారు. ప్రత్యేక పుష్పాలంకరణ భక్తులను బాగా ఆకట్టుకుంది. ఆలయ సహాయ కమిషనర్ మరియు కార్యనిర్వహణాధికారి కోవూరు జనార్దన్‌రెడ్డి పర్యవేక్షణలో ఈ ఉత్సవాలు అంగరంగవైభవంగా జరుగుతున్నాయి. నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డితో పాటు ఉత్సవ కమిటీ సభ్యులు, అమ్మవారి భక్తులు, జిల్లాలోని పలువురు ప్రముఖులు అందరూ ఈ ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారి సేవలో తరిస్తున్నారు. ఈ ఉత్సవాల్లో భాగంగా ఈనెల 26 శుక్రవారం శ్రీ మహాలక్ష్మి అలంకారం, 27న శ్రీ గజలక్ష్మి, 28న శ్రీ కాళికాదేవి, 29న శ్రీ సరస్వతి, దుర్గాష్టమి సందర్భంగా 30న శ్రీ దుర్గాదేవి ఆలంకారాలతో అమ్మవారికి విశేష పూజలు జరుగనున్నాయి. అక్టోబరు 1న శ్రీ మహిషాసురమర్ధిని అలంకారం, 2వ తేదీన విజయదశమి రోజున అమ్మవారికి శ్రీ రాజరాజేశ్వరి దేవి అలకారం వైభవంగా ఉంటాయి. ఆరోజు వేకువన 4గంటలకు మహాభిషేకం, రాత్రి 9గంటల నుంచి నగరోత్సవం కన్నులపండువగా ఉండబోతోంది.

# మునిసిపల్ స్టాండింగ్ కౌన్సిల్‌గా రంగారావు



నెల్లూరు నగరపాలకసంస్థ మునిసిపల్ స్టాండింగ్ కౌన్సిల్‌గా సీనియర్ న్యాయవాది వి.రంగారావును నియమిస్తూ కార్పొరేషన్ కమిషనర్ నందన్ ఉత్తర్వులు జారీ చేశారు. నగరపాలక సంస్థ కార్యాలయానికి న్యాయపరమైన సలహాలు ఇచ్చేందుకు, కార్పొరేషన్ తరఫున కేసులను వాదించేందుకు ఆయన్ను నియమించారు. సెప్టెంబరు1 నుంచి 2028ఆగస్టు 31వ తేదీ వరకు ఆయన ఆ పదవిలో ఉంటారు. గత మూడేళ్లుగా ఆయన కార్పొరేషన్ న్యాయసలహాదారుగా ఉన్నారు. ఆయన సేవలను గుర్తించి మళ్ళీ ఆ పదవిలో నియమించారు.

## నెల్లూరు కబుర్లు

# వృద్ధురాలి పట్ల..కలెక్టర్ కరుణ



తన కుమారుడు ఇంటినుంచి గెంటేయగా, తనకు న్యాయం చేయాలంటూ నడవలేని స్థితిలో ఉన్న ఓ వృద్ధురాలిని చూసి కొత్తగా వచ్చిన జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా చలించిపోయారు. కలెక్టరేట్ వద్దకు అర్జీ ఇవ్వడానికి వచ్చిన ఆమె వద్దకు తనే స్వయంగా వెళ్ళి అర్జీ స్వీకరించి, న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. సోమవారం నాడు ప్రజాసమస్యల పరిష్కార వేదిక సందర్భంగా ఈ సంఘటన జరిగింది. కావలికి చెందిన రమా జ్యోతి అనే వృద్ధురాలు ఆ వేదిక సమీపంలో నడవలేని స్థితిలో కింద చతికిలపడి ఉండగా, అటుగా వెళ్తున్న కలెక్టర్ ఆ వృద్ధురాలిని గమనించి, ఆమె వద్దకు వెళ్ళి వివరాలడిగి తెలుసుకున్నారు. తానున్న ఇంటిని రాయించుకున్న పెద్దకొడుకు, ఆ తర్వాత తనను ఇంటినుంచి వెళ్లగొట్టాడని ఆమె కన్నీళ్ళతో కలెక్టర్‌కు చెప్పుకోవడంతో, కలెక్టర్ వెంటనే అధికారులను పిలిచి, ఆమెకు న్యాయం చేయాలని ఆదేశించడం అక్కడున్న వారందరినీ ఆకట్టుకుంది. కలెక్టర్‌కు అదే తొలి అర్జీ అయింది కూడా.

# జాయింట్ కలెక్టర్.. బాధ్యతల స్వీకరణ



జిల్లాకి కొత్త జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. సోమవారం ఆయన నెల్లూరు కలెక్టరేట్‌లో ఆమేరకు బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు ప్రభుత్వ అధికారులు స్వాగతం పలికి అభినందనలు తెలిపారు. కొత్త జేసీకి 'లాయర్' శుభాకాంక్షలు.



# పరిశుభ్రతపై అవగాహన

కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్,-నెల్లూరు వారి ఆధ్వర్యంలో ఈనెల 23న స్థానిక విక్రమ సింహపురి యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ మరియు ఆదిత్య డిగ్రీ కళాశాల వారి సంయుక్త సహకారంతో 'స్వచ్ఛతా హి సేవ' కార్యక్రమం జరిగింది. ఆదిత్య డిగ్రీ కళాశాల ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో క్షేత్ర ప్రచార సహాయకులు, పి.హరికృష్ణ మాట్లాడుతూ పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. తొలుత, స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేసి, అందరూ కలసి వీధులను శుభ్రం చేశారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

# ప్రీ-రిపబ్లిక్ డే క్యాంపుకు.. గురుచరణ్



10-ఆంధ్ర నేవల్ యూనిట్ ఎన్‌సిసి నెల్లూరు లెఫ్టినెంట్ కమాండర్ గణేష్ గొదంగవే పర్యవేక్షణలో ఇటీవల ప్రీ రిపబ్లిక్ డే ఎంపికలు జరిగాయి. సెప్టెంబర్ 24 నుంచి పది రోజుల పాటు గుంటూరులో గుంటూరు గ్రూప్ కమాండర్ సారథ్యంలో ఆ మేరకు క్యాంపు నిర్వహించనున్నారు. నెల్లూరు నగరంలోని వెంగళరావు నగర్‌లో ఉన్న మునిసిపల్ కార్పొరేషన్ హైస్కూల్, ఎన్‌సిసి క్యాడెట్ పెరంకొండ గురుచరణ్ ఎంపిక కావడంతో ఆ పాఠశాల ప్రధాన ఉపాధ్యాయిని శ్రీమతి సి.మంజుల వాణి, ఎన్‌సిసి సెకండ్ ఆఫీసర్ గుండాల నరేంద్ర బాబు ఆ విద్యార్థిని అభినందించారు.

# పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

పర్యావరణాన్ని పరిరక్షించాలని, పరిశుభ్రతను కాపాడుకోవాలని నెల్లూరు నగర కమిషనర్ వై.నందన్ పిలుపునిచ్చారు. ఇటీవల నగరంలోని 28వ డివిజన్‌లో టీడీపీ నాయకులు నిర్వహించిన స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన స్థానికులతో కలసి పర్యావరణ పరిరక్షణకు ప్రతిజ్ఞ చేయించారు. ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి సంరక్షించాలని, మొక్కల పెంపకాన్ని ఆదర్శంగా చేపట్టాలని సూచించారు. స్థానిక కార్పొరేటర్లు కర్తం ప్రతాప్‌రెడ్డి, వేనాటి శ్రీకాంత్‌రెడ్డి, రాష్ట్ర వేర్‌హౌస్ కార్పొరేషన్ డైరెక్టర్ కప్పిర శ్రీనివాసులు, గణేశం వెంకటేశ్వర్లు, సిటీ టీడీపీ మహిళా నాయకురాలు కప్పిర రేవతి తదితరులు పాల్గొన్నారు.

# రక్తదాన దినోత్సవ కార్యక్రమం..5న



ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటి - నెల్లూరు జిల్లా శాఖ రక్తనిధిలో ఏటా జరుపుకొంటున్న జాతీయ స్వచ్ఛంధ రక్తదాన దినోత్సవాన్ని ఈసారి అక్టోబర్ 1న కాకుండా, అక్టోబర్ 5 న జరుపుకోవాలని భావిస్తూ ఆ మేరకు రెడ్‌క్రాస్ ప్రతినిధులు ఈనెల 23న జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాను కలసి అనుమతి కోరారు. ఆరోజున నిర్వహించే కార్యక్రమానికి రావాల్సిందిగా వారు కలెక్టర్‌ను ఆహ్వానించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ను కలిసినవారిలో రక్తనిధి సలహాదారు మలిరెడ్డి కోటారెడ్డి, కన్వీనర్ సి. హెచ్.అజయ్‌బాబు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డా.యశోవర్ధన్ తదితరులున్నారు.






# షిర్డీలో..సాయిదర్బార్ పల్లకీ ఉత్సవం



శ్రీ షిర్డీ సాయినాథుని ధ్యానిస్తూ, సాయిమాల ధారణ మండల దీక్ష పూర్తి చేసుకొని నెల్లూరు నుండి ఇటీవల షిర్డీకి వెళ్ళిన 300 మంది శ్రీసాయిదర్బార్ భక్తులు షిర్డీలో సాయినాథుని పల్లకి ఉత్సవంలో పాల్గొన్నారు. భజనలు, నృత్యాలు చేస్తూ షిరిడీ సంస్థాన్ సమాధి మందిరం, ద్వారకామాయి, చావడి, గురుస్తాన్, నంద దీపం చుట్టూ మహా ప్రదక్షిణ చేశారు.




# రెండేళ్లలో రామాయపట్నం ఓడరేవు

## స్పెషల్ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబు



మరో రెండేళ్లలోనే గుడ్లూరు మండలం రామాయపట్నం ఓడ రేవు నిర్మాణ పనులు పూర్తిచేసే దిశగా పటిష్ట మైన చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ టి.కృష్ణ బాబు అధికారులను ఆదేశించారు. ఇటీవల ఆయన ఆ ఓడరేవు నిర్మాణాన్ని పరిశీలిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం ఓడరేవులు, విమానాశ్రయాల నిర్మాణాలపై పూర్తిస్థాయిలో దృష్టి సారించిందన్నారు. ఆ నిర్మాణాలు పూర్తయితే వేలాదిమందికి ఉద్యోగాలు, స్థానికులకు ఉపాధి అందుబాటులోకి వస్తుందన్నారు. బోగోలు మండలంలోని జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్, దగదర్తి మండలంలో విమా నాశ్రయ నిర్మాణాలను త్వరితగతిన నిర్మించాలని కృషిచేస్తోందని తెలిపారు. దగదర్తి విమానాశ్రయం కూడా రెండేళ్లలో అందుబాటులోకి వస్తుందని, ఆమేరకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ విమానాశ్రయం ఏర్పాటు విషయంలో ఉన్న భూ సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపారు. దగదర్తి విమానాశ్రయ భూముల మ్యాప్‌ను జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాతో కలసి ఆయన పరిశీలించారు. రాష్ట్ర మారిటైమ్ బోర్డు సీఇ ప్రవీణ్ ఆదిత్య, కందుకూరు సబ్ కలెక్టర్ హిమవంశీ, కావలి ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## శ్రీసిటీలో.. ఆయుర్వేద వైద్య శిబిరం

10వ జాతీయ ఆయుర్వేద దినోత్స వాన్ని పురస్కరించుని ఈనెల 23న శ్రీసిటీ ఫౌండేషన్, తులసి ఆయుర్వేద ఆసుపత్రి సంయుక్తంగా శ్రీసిటీలో నిర్వహించిన ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. శ్రీసిటీ పరిశ్రమల ఉద్యోగులు, పరిసర గ్రామాల ప్రజలు వైద్య సేవలను వినియోగించుకున్నారు. తులసి ఆయుర్వేదిక్ ఆసుపత్రి వైద్యులు శివప్రసాద్ ఆధ్వర్యంలో, 200 మందికి పైగా రోగులకు వైద్యపరీక్షలు చేసి, ఉచి తంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మెడికల్ సెంటర్ ఆవరణలో శ్రీసిటీ ప్రతినిధులు నిరీషా సన్నారెడ్డి, రమేష్ కుమార్, డాక్టర్ శివప్రసాద్ వివిధ ఔషధ మొక్కలు నాటారు.

# కార్యకర్తలను కంటికి రెప్పలా చూసుకుంటాం

## మంత్రి నారాయణ



తెలుగుదేశం పార్టీలోని ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా చూసుకుంటామని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ చెప్పారు. ఇటీవల ఆయన నెల్లూరులోని తన క్యాంపు కార్యాలయంలో నగరంలోని పార్టీ కార్యకర్తలు, నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మట్లాడుతూ, కార్యకర్తల సంక్షేమానికి పార్టీ పెద్దపీట వేసినట్లు తెలిపారు. పార్టీ కార్యకర్తలను అన్ని విధాలా ఆదుకుంటామన్నారు. అయితే, కేవలం తన చుట్టూ తిరగడం వల్ల మాత్రం పదవులు రావని..క్షేత్రస్థాయిలో పార్టీకోసం బాగా పనిచేస్తేనే పదవులు వస్తాయన్నారు... నాయకుల పనితీరును ఎప్పటి కప్పుడు పార్టీ అధిష్టానం తెలుసుకుంటూ ఉంటుందన్నారు. నాయకులు, కార్యకర్తలు ప్రజల్లో బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ప్రతిఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేస్తూ, ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా మనం సేవలందించాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు ధర్మవరపు సుబ్బారావు, విజయభాస్కర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్లపాక అనురాధ, మాజీ జడ్పీటిసి విజేతరెడ్డి, టిడిపి ముఖ్య నేతలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కన్యకాపరమేశ్వరి అమ్మవారికి.. కన్నులపండువగా నవరాత్రి పూజలు



ఆర్యవైశ్యుల ఆరాధ్యదైవం, నెల్లూరు స్టోన్ హౌస్‌పేటలో కొలువైవున్న శ్రీ కన్యకా పరమేశ్వరి దేవి అమ్మవారి ఆలయంలో దేవీ శరన్నవరాత్రి వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మెన్ కోట గురుబ్రహ్మం, కమిటీ ప్రతినిధులు, సభ్యులు, ఉత్సవకమిటీవారు కలసి అమ్మవారి ఉత్సవాలను నయనానంద కరంగా నిర్వహిస్తున్నారు. ఈ వేడుకల్లో భాగంగా అమ్మవారికి 22న శ్రీ కాత్యాయిని, 23న శ్రీ భవాని, 24న శ్రీ బాలాత్రిపురసుందరి, 25న శ్రీ అన్నపూర్ణాదేవి అలంకారాలు నిర్వహించారు. ఈనెల 26న శుక్రవారం శ్రీ రాజరాజేశ్వరిదేవి అలంకారం, మూలవర్లకు లక్షగాజులతో అలంకారం ఉంటుంది. 27న శ్రీ గాయత్రి అలంకారం, మూల వర్లకు ముత్యాల చీరతో అలంకారం ఉంటాయి. 28న శ్రీ ధన లక్ష్మీ అలంకారం, అమ్మవారికి తామరపూల అలంకారం, 29న శ్రీ సరస్వతిదేవి అలంకారం, మూలవర్లకు పుస్తకాలు, పెన్నులతో అలంకారం ఉంటాయి. 30న శ్రీ దుర్గాదేవి అలంకారం, మూలవర్లకు కుంకుమాలంకారం, నిమ్మకాయ లతో అలంకారం నిర్వహిస్తారు. అక్టోబరు 1న ఉదయం 9 గంటలకు కన్యపూజ, సాయంత్రం శ్రీ గజలక్ష్మి అలంకారం, అక్టోబరు 2 విజయ దశమి పర్వదినం రోజున అమ్మవారికి శమీపూజ, మూలవర్లకు పూలంగిసేవ, సాయంత్రం 7గంటల నుంచి అమ్మ వారి నగరోత్సవం ఉంటాయి. 3వతేదీన ఉదయం 10 గంటలకు వసంతోత్సవం, సాయంత్రం 6 గంటలకు దర్బారు అలంకారం, మూలవర్లకు మల్లెపూల అలంకారం నేత్రపర్వంగా ఉంటాయి. పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుంటున్నారు.











# శ్రీసిటీలో హెచ్‌సీసీ బృందం

చెన్నైలోని హిందూస్థాన్ చాంబర్ ఆఫ్ కామర్స్ (హెచ్‌సీసీ)కి చెందిన 25 మంది ప్రతినిధుల బృందం ఇటీవల శ్రీసిటీని సందర్శించింది. అక్కడ వ్యాపార అవకాశాలు, పారిశ్రామిక సామర్థ్యాన్ని పరిశీలించింది. ఆ సంస్థ చైర్మన్ గోపీనాథ్, వైస్ ప్రెసిడెంట్ ప్రవీణ్ తాతియా నేతృత్వంలో వచ్చిన ఆ బృందానికి శ్రీసిటీ డైరెక్టర్ (సీఎస్సార్) నిరీషా సన్నారెడ్డి స్వాగతం పలికారు. ఈ సందర్శనపై స్పందించిన శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, హెచ్‌సీసీ బృందం వారి పరిశీలనలు, సూచనలు శ్రీసిటీ పరిశ్రమలకు ఎంతో ఉపయోగపడతాయన్నారు.

## శ్రీసిటీ–'రాక్‌వర్త్' 14వ వార్షికోత్సవం



కార్యాలయాల ఫర్నిచర్ తయారీలో అగ్రగామి సంస్థ 'రాక్‌వర్త్ సిస్టమ్స్ ఫర్నీచర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్' వారు ఇటీవల శ్రీసిటీలోని తమ పరిశ్రమ 14వ వార్షికోత్సవాన్ని ఇటీవల ఘనంగా జరుపుకున్నారు. సంస్థ ఉద్యోగులందరికీ వినోదాత్మక ఆటలు, పోటీలు నిర్వహించారు. ఈ వేడుకలో కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ శైలేష్ కుమార్, తన తల్లి జ్ఞాపకార్థం మీనాదేవి మెమోరియల్ ట్రస్ట్ పేరిట విద్యార్థులకు ఆర్థిక సహాయం అందజేశారు. రాక్‌వర్త్ ఉద్యోగుల పిల్లలు 40 మందికి, పరిసరాలకు చెందిన ఇతర పిల్లలు మరో 25 మందికి, మొత్తంగా 30 లక్షల రూపాయలను విద్యా ఫీజులుగా చెల్లించి, రసీదులను విద్యార్థులకు ఇచ్చారు.

# ఎన్‌బీకేఆర్‌లో ఎన్‌సీసీ ఎంపికలు



కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇటీవల 2–ఆంధ్ర ఇఎంఇ యూనిట్ ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ ఆధ్వర్యంలో ఎన్‌సీసీ ఎంపికలు జరిగాయి. కళాశాలలో ప్రథమ సంవత్సరంలో చేరిన 35 మంది విద్యార్థిని, విద్యార్థులను ఎన్‌సీసీ విభాగం కోసం ఎంపిక చేసినట్లు కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు మూడు సంవత్సరాలపాటు ఆర్మీ శిక్షణ, క్రమశిక్షణ, కవాతు, రైఫిల్ ఫైరింగ్, నాయకత్వ లక్షణాలు మరియు సమాజం పట్ల బాధ్యత–అవగాహన లాంటి అంశాలపై శిక్షణ ఇస్తారని తెలిపారు. ఎన్‌సీసీలో 'సీ' సర్టిఫికెట్ సాధించడం ద్వారా ఆర్మీ మరియు పోలీస్ విభాగాలలో చేరడానికి ప్రత్యేక కోటా ఉంటుందని, అంతర్జాతీయ కంపెనీలు కూడా ఎన్‌సీసీ విద్యార్థులకు తగిన ప్రాధాన్యత ఇస్తాయని ఎన్‌సీసీ అధికారి గోవిందు మాధవయ్య తెలిపారు. కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ అరుణ్‌కుమార్, ఎన్‌సీసీ అధికారులు పాల్గొన్నారు.

## కబడ్డీ టోర్నమెంట్‌కు చైతన్య

ఎన్‌బీకెఆర్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి వై.చైతన్య కబడ్డీలో సత్తాచాటుతున్నాడు. ఇటీవల జేఎన్‌టీయూఏ విశ్వవిద్యాలయానికి ప్రాతినిధ్యం వహిస్తూ 2025–26 దక్షిణ భారత విశ్వవిద్యాలయ కబడ్డీ టోర్నమెంట్‌లో పాల్గొనడానికి ఎంపికయ్యారు. ఈ పోటీలు అక్టోబర్ 1 నుండి 5 వరకు కర్నాటక రాష్ట్రం బెల్గావిలోని రాణి చెన్నమ్మ విశ్వవిద్యాలయంలో జరగనున్నాయి. ఈ ఎంపికలు ఇటీవల అనంత లక్ష్మి ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, అనంతపురంలో నిర్వహించబడ్డాయి. కళాశాల డైరెక్టర్ డా.వి.విజయకుమార్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ డా.వి.మల్లికార్జునరెడ్డి తదితరులు చైతన్యను అభినందించారు.

## కళాశాల స్థాయిలో సింపోజియం



ఎన్‌బీకెఆర్ ఐఎస్టీలో ఇటీవల కళాశాల స్థాయి సామాజిక సింపోజియం నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి, డాక్టర్ ఎం.శ్రీనివాసులు, డాక్టర్ జి.హరినాథరెడ్డి, డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ ఎం.శివప్రతాప్‌రెడ్డి, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ పర్యవేక్షించారు. ఎన్‌బీకెఆర్ ఐఎస్టీలోని వివిధ విభాగాల విద్యార్థులు మహిళా సాధికారత, వ్యవసాయంలో స్మార్ట్ టెక్నాలజీ, సోషల్ మీడియా ప్రభావాలు, యోగా–ధ్యానం, ఇ–లెర్నింగ్, గుడ్ గవర్నెన్స్ మరియు ఫిజికల్ ఫిట్‌నెస్ వంటి సామాజికంగా సంబంధిత అంశాలపై పేపర్ మరియు పోస్టర్ ప్రెజెంటేషన్లలో చురుకుగా పాల్గొన్నారు. విజేతలకు మరియు పాల్గొన్న వారికి బహుమతులు మరియు సర్టిఫికెట్లు బహుకరించారు.

# తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

## భక్తిశ్రద్ధలతో జెండా ఉత్సవం



ఆంజనేయస్వామి వారి జెండా ఉత్సవాన్ని గూడూరులో అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఎన్నడూ లేని విధంగా రంగురంగుల విద్యుద్దీపాలంకరణలు, భారీ సెట్టింగ్‌లు, బాణాసంచా మోతలు, కేరళ నృత్యాల మధ్య సందడి వాతావరణంలో ఉత్సవం సాగింది. ఏటా దసరా ముందు వచ్చే అమావాస్య రోజు ఈ జెండా ఉత్సవాన్ని నిర్వహించడం సంప్రదాయంగా వస్తోంది. గూడూరు పట్టణంలోని ఆంజనేయస్వామి జెండాలను ప్రధాన ప్రాంతాల్లో శాస్త్రోక్తంగా పూజలు చేసి ఊరేగించారు. సుమారు వంద జెండాలను పట్టణ వీధుల్లో నిర్వాహకులు ఏర్పాటు చేశారు. డీఎస్పీ గీతాకుమారి ఆధ్వర్యంలో 400 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. పట్టణ, రూరల్ సీఐలు శేఖర్‌బాబు, శ్రీనివాస్ కిషోర్‌బాబు, ఎస్సైలు పాల్గొన్నారు.

## ఖాళీ పోస్టులను భర్తీ చేయండి

### బీసీ సెక్రటరీ మాధవీలతకు ఎమ్మెల్యే సునీల్ వినతి



బీసీ రెసిడెన్షియల్ స్కూల్స్‌లో ఖాళీగా ఉన్న పోస్టులను త్వరగా భర్తీ చేయాలని, మౌలిక వసతులు కల్పించాలంటూ గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్‌కుమార్ బీసీ సెక్రటరీ మాధవీలతకు విన్నవించారు. ఈ విషయమై విజయవాడలో ఆమెను కలిసి వినతిపత్రం సమర్పించారు. అలాగే రోజువారి వేతనంతో పనిచేస్తున్న వారిని అవుట్ సోర్సింగ్ పద్ధతిన చేర్పించేలా చర్యలు తీసుకోవాలని ఆమెను కోరారు.

## టీబీ వ్యాధిపై ఆందోళన వద్దు



### - డాక్టర్ షరీనా

టీబీ వ్యాధిపై రోగులు ఆందోళన చెందొద్దని గూడూరు వైద్య విధాన పరిషత్ సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా అన్నారు. ఈనెల 22వతేదీ అబైండింగ్ హోప్ ట్రస్ట్ నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాల నుంచి ప్రతి నెల 500 మందికి ఒక్కొక్కరికి 1500 రూపాయల విలువైన న్యూట్రిషన్ ఫుడ్ ప్యాకెట్లు అందజేయడం అభినందనీయమన్నారు. ప్రభుత్వం ఇచ్చే మందులతో పాటు న్యూట్రిషన్ ఫుడ్ తీసుకుంటే తప్పకుండా వ్యాధి నయమవుతుందని ఆమె పేర్కొన్నారు. ట్రస్ట్ ఛైర్మెన్ డాక్టర్ నిర్మల్‌కుమార్, డాక్టర్ రేష్మ, ఏవో కమల్‌కిరణ్, జయప్రకాష్, సురేందర్‌రెడ్డి, ప్రియాంక, క్రాంతికుమార్, శకుంతల, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## పూర్వ ప్రాథమిక విద్యపై అవగాహన



గూడూరు పట్టణం, అంబేద్కర్‌నగర్‌లోని అంగన్వాడీ కేంద్రంలో ఇటీవల 8వ రాష్ట్రీయ పోషణ మాసోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ ఆర్.సుజన పూర్వ ప్రాథమిక విద్య ప్రాముఖ్యత గురించి 0–3 సంవత్సరాల పిల్లల తల్లులకు అవగాహ కల్పించారు. అంగన్వాడీ కేంద్రాలలోనే పిల్లలకు గట్టి పునాది ఉంటుందన్నారు. ఈ దశలోనే పిల్లల్లో ఐదు రకాల అభివృద్ధులు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పద్మావతి తదితరులు పాల్గొన్నారు.



## జిల్లా సదస్సు విజయవంతం చేయండి

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 26వ తేదీన గూడూరులో నిర్వహించే బీసీడబ్ల్యూ జిల్లా సదస్సును జయప్రదం చేయాలని ఆ సంఘ గౌరవాధ్యక్షులు పోలయ్య కోరారు. గూడూరు పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఈ నెల 23వ తేదీ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థికంగా చితికిపోతున్న కార్మికులకు ప్రభుత్వాలు రాయితీ లోన్లు అందించి వారికి ఆర్థిక భరోసా కల్పించి ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చెంగళ్‌రావు, నవకోటి, అనీల్, రత్నం తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు సరుకుల పంపిణీ



జేవీవీ ఆధ్వర్యంలో, గుర్రం విజయబాబు దాతృత్వంతో ఈ నెల 21వ తేదీ గూడూరు విశ్రాంత ఉద్యోగుల భవనంలో దివ్యాంగులకు కూరగాయలు, గుడ్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా కార్యక్రమ దాతలు విజయబాబును, వారి కుమార్తె ఇక్షితలను జేవీవీ అధ్యక్షులు వేగూరు రాజేంద్రప్రసాద్ అభినందించారు. అక్టోబర్ 2వ తేదీలోగా ప్లాస్టిక్‌ను పూర్తిగా నివారిస్తామని ఆయన అన్నారు. జేవీవీ ప్రతినిధులు చెంచు నారాయణ, రామ్మోహన్, సుబ్బారావు, ఆనంద్, గోపి, జగదీష్, పవన్, ఇబ్రహీం, ఇక్షిత, గుర్రం రాంబాబు, శ్రీనివాసాచారి, సుధీర్, అశోక్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

### శాసనమండలిలో
# పర్వతరెడ్డి నిరసన




ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ, ఇటీవల గుంటూరుజిల్లా వెలగపూడిలోని ఏపీ శాసనమండలి ఆవరణలో జిల్లా వైసీపీ నాయకుడు.. ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి సమావేశాలను బహిష్కరించారు. వైకాపా శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణతో పాటు ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఇతర శాసనమండలి సభ్యులతో కలిసి.. మండలి సమావేశాలను బహిష్కరించారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు అనుగుణంగా ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నెంబర్ 590ను వెంటనే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ప్రజారోగ్యాన్ని ప్రైవేటు చేతుల్లో పెట్టి.. ఆరోగ్య సేవలను.. ప్రజలకు మరింత భారం చేయనుందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.

# కార్యాలయాల మరమ్మతులకు నిధులు
### జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ



నెల్లూరు జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ ఇటీవల నెల్లూరు డీఎల్‌డీఓ కార్యాలయ పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అక్టోబరు నెలలో జిల్లాలో ప్రారంభం కావలసిన 5 డీఎల్‌డీఓ కార్యాలయాల ఏర్పాటుకు ఒక్కొక్క డివిజన్ కార్యాలయానికి, వాటి మరమ్మత్తులకు సుమారు 6లక్షల రూపాయలు కేటాయించినట్లు ఆమె చెప్పారు. వాటి పనులు నిర్ణీత సమయంలో పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని ఆమె అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఇఓ జె.మోహన్‌రావు, అధికారులు పాల్గొన్నారు.

# పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలి
### తల్లిదండ్రుల సమావేశంలో సీఐ వేణుగోపాల్




తల్లిదండ్రులు చదువుతోపాటు ఆట, పాటలలో పిల్లలను ప్రోత్సహించాలని నెల్లూరులోని నవాబుపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.వేణుగోపాల్‌రెడ్డి చెప్పారు. ఇటీవల స్థానిక జాకీర్‌హుస్సేన్‌నగర్‌లోని ఎస్.వి.ఆర్. హైస్కూలులో జరిగిన తల్లిదండ్రుల సమావేశంలో ఆయన పాల్గొని పిల్లల భవిష్యత్తుకు తల్లితండ్రులే పునాదులన్నారు. నెల్లూరు సిటీ మండల విద్యాశాఖ అధికారి ఎస్.కె. హమీద్ మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలతో స్నేహపూర్వకంగా మెలగాలని సూచించారు. పిల్లలు దురలవాట్లకు దూరంగా ఉండేలా చూసేందుకు పెద్దలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పిల్లలను ఎల్ల వేళలా గమనిస్తూ.. కంటికి రెప్పలా కాపాడుకోవాలన్నారు. స్కూలు కరెస్పాండెంట్ అందే శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ బి.రమేష్ బాబు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### ట్రంప్ నిర్ణయం
# ఎవరికి మంచి.. ఎవరికి చెడు?

మనసులో మాట 64

రోజుకో వివాదాస్పద నిర్ణయంతో వలస దారులపై అక్కసు ప్రకటించే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తాజాగా హెచ్1బి వార్షిక రుసుమును లక్షడాలర్లకు పెంచి భారతీయులపై పెద్ద పిడుగు వేశారు. ఇది మంచా? చెడా? ఎవరికి లాభం? ఎవరికి నష్టం? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. అయితే ట్రంప్ నిర్ణయం దీర్ఘకాలంలో భారతీయులకు మేలే చేస్తుంది. ట్రంప్ తీసుకున్న ఈ నిర్ణయం ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా, ముఖ్యంగా భారత ఐటీ రంగంలో పెను ప్రకంపనలు సృష్టిస్తోందనడంలో సందేహం లేదు. అమెరికాలో పనిచేయాలని ఆశించే లక్షలాది మంది భారతీయ నిపుణుల ఆశలపై ఈ నిర్ణయం నీళ్లు చల్లింది. ట్రంప్ 'అమెరికా ఫస్ట్' విధానంలో ఇదొక కీలక అడుగుగా కనిపిస్తున్నప్పటికీ, దీని పర్యవసానాలు అమెరికా ఆవిష్కరణల వ్యవస్థను దెబ్బతీసి, భారత్‌కు పరోక్షంగా మేలు చేకూరుస్తుంది. నాణేనికి మరో కోణం కూడా ఉంది. అమెరికాలో ఇప్పటికే చాలా మంది భారతీయులు బెంచ్‌పై ఉన్నారు. పెంచిన రుసుం కారణంగా కొత్తగా హెచ్1బి వీసాలు తీసుకోవడానికి కంపెనీలు వెనకాడే అవకాశం ఉంది. దాని బదులు ఇప్పటికే అక్కడ ఉన్న వారిని నియమించుకునే అవకాశాలు లేకపోలేదు. ట్రంప్ నిర్ణయం తమకు మేలు చేస్తుందని అక్కడ బెంచ్‌పై ఉన్న పలువురు భారతీయులు భావిస్తున్నారు.

### భారత ఐటీ పరిశ్రమపై తక్షణ ప్రభావం

ట్రంప్ నిర్ణయం తక్షణ ప్రభావం భారత ఐటీ కంపెనీల బ్యాలెన్స్ షీట్లపై పడనుంది. టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ వంటి దిగ్గజ సంస్థలు ప్రతి సంవత్సరం వేలాది మంది ఉద్యోగులను హెచ్-1బీ వీసాలపై అమెరికాకు పంపిస్తాయి. ప్రస్తుతం 2,000 నుంచి 5,000 డాలర్ల మధ్య ఉన్న రుసుము ఒక్కసారిగా లక్ష డాలర్లకు పెరగడంతో కంపెనీల నిర్వహణ వ్యయం భారీగా పెరగనుంది. పరిశ్రమ వర్గాల అంచనాల ప్రకారం, ఈ పెంపు వల్ల ఐటీ కంపెనీల నిర్వహణ లాభాలు 7 నుంచి 15 శాతం వరకు తగ్గే అవకాశం ఉంది. కంపెనీలు ఇప్పుడు ఆన్‌సైట్ ప్రాజెక్టుల వ్యూహాలను పునఃసమీక్షించుకోవాల్సి వస్తుంది. అమెరికాలో స్థానికంగా నియామకాలు పెంచడం లేదా ప్రాజెక్టులను వీలైనంత వరకు భారత్‌కు తరలించడం (ఆఫ్‌షోరింగ్) వంటి ప్రత్యామ్నాయాలను అవి అన్వేషించవచ్చు.

ట్రంప్ తాజాగా తీసుకున్న నిర్ణయాన్ని అందరూ షాక్‌గా అభివర్ణిస్తున్నారు. నిజానికి ఇప్పుడే కొత్తగా షాక్ తగిలిందేమీ లేదు. ట్రంప్ తన వైఖరి మొదటినుంచి స్పష్టం చేస్తూనే ఉన్నారు. బయటి వారు వచ్చి అమెరికా వనరులు దోచేసుకుంటున్నారని ఆరోపిస్తూనే ఉన్నారు. ఆయన తీసుకుంటున్న ప్రతి చర్యా దానికి అనుగుణంగానే ఉంటోంది. ప్రభుత్వ యంత్రాంగంలో చాలామందిని వలస వ్యతిరేక వాదులనే నియమించుకున్నారు. ముఖ్యంగా ట్రంప్, ఆయన యంత్రాంగంలో భారత్ పట్ల వ్యతిరేకత ప్రస్ఫుటమవుతోంది. మీ ఇంటికొచ్చినప్పుడు మాకేం పెడతావు.. మా ఇంటికొస్తే ఏం తీసుకొస్తావు అన్నట్లే ట్రంప్, ఆయన యంత్రాంగం ధోరణి ఉంది. అంతర్లీనంగా ఆయన, ఆయన యంత్రాంగంలో కొంత మందిలో శ్వేతజాతీయుల పట్ల అనుకూల వైఖరి, ఇతరుల పట్ల ముఖ్యంగా ఆసియా వాసుల పట్ల వివక్షా ధోరణి కనిపిస్తోంది. నేరుగా దాన్ని ప్రకటించకపోవచ్చు కానీ, కొన్ని రకాల పరోక్ష చేతలు, మాటల ద్వారా మనం గ్రహించవచ్చు. మా ఇంటికి రావద్దు పొండి అంటున్నా చూరు పట్టుకుని వేలాడడం మంచిది కాదు.

అమెరికాకు వెళ్లడం అనేది సగటు భారతీయుల లక్ష్యం అయిపోయింది. అమెరికానే ఎందుకు? ఎందుకంటే అక్కడ డాలర్ల పంట పండించుకోవచ్చు. కొంత వెనకేసుకోవచ్చు. యువత అంతటితోనే ఆగిపోతోంది. కానీ, లక్ష్యం మరింత సమున్నతంగా ఉండాలి. గొప్ప ఆవిష్కరణలు చేయాలి. మంచి సంస్థను అభివృద్ధి చేయాలనే తపన ఉండాలి. ఇలాంటి లక్ష్యాలు ఉన్నప్పుడు అమెరికాకి పరుగులు పెట్టాల్సిన పని లేదు. మన దేశంలోనే చాలా అవకాశాలున్నాయి. భారత్ ఏ దేశానికీ తీసిపోదు. కాస్త చక్కదిద్దుకోవాలి. ఇంట్లో కాస్త అస్తవ్యవస్తంగా ఉందని పక్క ఇంట్లో తిష్టవేద్దామనుకుంటారా ఎవరైనా? ఇంటిని చక్కదిద్దుకోవాలి. భారత్‌కు గొప్ప విజ్ఞాన చరిత్ర ఉంది. ఇక్కడి నుంచే చాలా విజ్ఞానం తరలివెళ్లింది. ప్రపంచవ్యాప్తంగా ఎంతో మంది ఇక్కడకు వచ్చి విజ్ఞానం సముపార్జించుకుని వెళ్లారు. భారతదేశంలో ప్రతిభకు కొదవలేదు. గతంలోనూ టెక్నాలజీపై ఆంక్షలు వచ్చినప్పుడు మనమే కొత్త పరిష్కారాలు కనిపెట్టాం. ఈ నేల, ఈగాలిలో మేధస్సు ఉంది. దురదృష్టవశాత్తూ ఇప్పటికీ అమెరికా, ఆస్ట్రేలియా అంటూ మన మేధస్సుతో పాశ్చాత్యుల ఆర్థిక వ్యవస్థను బాగు చేస్తున్నాం. ఇది ఇంతటితో ఆగిపోవాలి. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీ ఇచ్చిన పిలుపు అర్థవంతంగా ఉంది. "విదేశాలపై ఆధారపడటమే మన అసలు శత్రువు" అంటూ స్వదేశీ వస్తువులనే కొనాలని, వ్యాపారులు కూడా స్వదేశీ వస్తువులనే విక్రయించాలని పిలుపునిచ్చారు. మొత్తం మీద ట్రంప్ నిర్ణయం స్వల్పకాలంలో ఆర్థికంగా నష్టం కలిగించవచ్చు, వేలాది కుటుంబాలలో అనిశ్చితిని నింపవచ్చు. అయితే, దీర్ఘకాలంలో ఇది "రివర్స్ బ్రెయిన్ డ్రెయిన్"కు దారితీసి, అత్యున్నత నైపుణ్యం కలిగిన నిపుణులను తిరిగి భారత్‌కు రప్పించే అవకాశం ఉంది. ప్రధాని మోదీ చెప్పినట్లు, ఈ సంక్షోభం స్వావలంబన దిశగా భారత్ అడుగులు వేయడానికి ఒక ఉత్ప్రేరకంగా మారవచ్చు. ఇప్పటికైనా కళ్లు తెరుద్దాం. మన ఇంటిని మనం బాగు చేసుకుందాం. ఇక్కడ వనరులకు కొదవ లేదు. కావాల్సింది సంకల్పబలమే. హెచ్-1బి వీసా ఫీజు పెంపు ఒక ఆటంకం. కానీ ఇది ఒక అవకాశం కూడా. భారత యువతలో ఉన్న ప్రతిభను ప్రపంచానికి చూపించడానికి, మనం స్వతంత్రంగా ఎదగడనికి ఇది సరైన సమయం. అమెరికా తలుపులు కాస్త మూసుకున్నా, మనమే కొత్త తలుపులు తెరవాలి.



**తుమ్మల బాల గంగాధర్ తిలక్**




### నెల్లూరులో..
## విద్యుత్ ఉద్యోగుల రిలే-దీక్షలు

తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు నెల్లూరులో విద్యుత్ ఉద్యోగులు దీక్షలు ప్రారంభించారు. ఇటీవల నగరంలోని జిల్లా సర్కిల్ కార్యాలయం వద్ద విద్యుత్ జేఏసీ ఆధ్వర్యంలో ఆరవరోజు రిలే దీక్షలు కొనసాగించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకుడు తలమంచి శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలు తీర్చకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. ఉద్యోగులు, కార్మికుల సమస్యలపట్ల విద్యుత్ సంస్థల యాజమాన్యం, ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని కోరారు. ఈ ఆందోళనలో జేఏసీ నాయకులు సీ.దామోదర్, శ్రీనివాసులు, నజీర్‌ఖాన్, వెంకటేశ్వర్లు, రఫీ నవాబ్‌జాన్, కాంట్రాక్ట్ యూనియన్ నాయకులు షేక్ హజరత్ వలీ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు

### కృష్ణపట్నంలో..
## కాంట్రాక్ట్ కార్మికుల ఆందోళన

ఏళ్ల తరబడి పనిచేస్తున్నా తమ ఉద్యోగాలు తాత్కాలికమేనా, కాంట్రాక్ట్ కార్మికులకు రెగ్యులర్ ఉద్యోగులయ్యే పరిస్థితి లేదా అంటూ ముత్తుకూరులోని ఏపీ జెన్‌కో థర్మల్ కేంద్రంలో పనిచేస్తున్న అనేకమంది కాంట్రాక్ట్ కార్మికులు ఆవేదనతో ఇటీవల ఆందోళన ప్రారంభించారు. ఈ సందర్భంగా యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు ప్రభుత్వానికి తమ కష్టాలు వినిపించారు. ఏపీ జెన్‌కో మెయిన్‌గేటు వద్ద సీఐటియు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు యూనియన్ నాయకులు నిరసనలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ విభాగంలో పనిచేస్తున్న సుమారు 23,500 మంది కాంట్రాక్ట్ కార్మికులను ఇకనైనా పర్మనెంట్ చేయాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కాంట్రాక్ట్ కార్మికులకు నేరుగా జీతాలు చెల్లించేవిధంగా తమను సంస్థలో విలీనం చేయాలని కోరారు. ఈ ఆందోళనలో యూనియన్ నాయకులు ఆదిశేషయ్య, ప్రధాన కార్యదర్శి భాస్కర్, నాయకులు శ్యాంప్రసాద్ తదతరులు పాల్గొన్నారు.

## ఉదయగిరిలో రైతుసంఘం నిరసన

భూముల రీసర్వేలో జరిగిన తప్పిదాలను సరిచేసి రైతులకు న్యాయం చేయాలంటూ ఏపీ రైతుసంఘం ఆధ్వర్యంలో ఇటీవల ఉదయగిరిలో రైతులు ఆందోళన చేశారు. ఉదయగిరి మండల పరిధిలోని రైతులకు 1-బీ అడంగల్ ఇవ్వాలంటూ రైతులు నినాదాలు చేశారు. రైతుసంఘం నాయకుడు కాకు వెంకటయ్య ఆధ్వర్యంలో ఈ ఆందోళన జరిగింది. అడంగల్ రాకపోవడంతో ప్రభుత్వ పథకాలు అందక, బ్యాంకుల్లో రుణాలు పొందలేక రైతులు పడే బాధలు వర్ణనాతీతంగా ఉంటున్నాయన్నారు. అర్హత కలిగి, భూమి ఉన్న ప్రతిరైతుకు అడంగళ్, పాస్‌బుక్‌లను సత్వరం మంజూరుచేయాలని వారు కోరారు. వెంటనే ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో ఈ విషయం పరిశీలించి తమకు న్యాయం చేయాలని కోరారు.

### 7న విజయవాడలో..
## ఏపీటీఎఫ్ ధర్నాందోళన

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారాన్ని కోరుతూ అక్టోబరు 7న విజయవాడలో పెద్దఎత్తున ధర్నాందోళన నిర్వహించనున్నారు. ఈనెల 21న నెల్లూరులో జరిగిన ఏపీటీఎఫ్ కార్యవర్గ సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ చిరంజీవి ధర్నాకి సంబంధించిన కరపత్రాలు, పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుంచి విముక్తి కలిగించాలని డిమాండ్ చేశారు. గత 15 నెలలుగా సమస్యల పరిష్కారం కోసం ఎదురుచూస్తున్నా ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర సబ్ కమిటీ సభ్యులు రియాజ్, జిల్లా అధ్యక్షుడు ఎం.సురేంద్రరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం.పిచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.




# సొంతగూటికి..బల్లి కల్యాణ్!

వైసీపీ ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి ఎట్టకేలకు సొంతగూటికి చేరుకున్నారు. తొలి నుంచి తెలుగుదేశం పార్టీలో ఉంటూ ఆ పార్టీకి సుదీర్ఘకాలం సేవలందించిన మాజీ మంత్రి, గూడూరు మాజీ ఎమ్మెల్యే బల్లి దుర్గాప్రసాద్ తనయుడే కల్యాణ్‌చక్రవర్తి. 2019లో టీడీపీ నుండి టికెట్ ఆశించిన దుర్గాప్రసాద్, టికెట్ రాకపోవడంతో భంగపాటుకు గురై వైసీపీలో చేరి తిరుపతి ఎంపీ టిక్కెట్ పొందారు. తిరుపతి ఎంపీగా గెలుపొందిన కొంతకాలనికే ఆయన కాలం చేయడంతో, ఆయన కుమారుడు కల్యాణ్ చక్రవర్తి వైసీపీలోనే కొనసాగి, వై.యస్.జగన్ ఆశీస్సులతో ఎమ్మెల్సీ పదవి పొందారు. ఆ తర్వాత కాలంలో వైసీపీ రాజకీయాల్లో ఇమడలేక, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆశీస్సులతో కల్యాణ్ తిరిగి టీడీపీలో చేరారు.

# జర్నలిస్టుల కష్టాలు తీర్చండి!

## • ప్రెస్ అకాడమీ ఛైర్మన్‌కి ఏపీజేఎఫ్ వినతి



రాష్ట్రంలోని అన్నిజిల్లాల్లో జర్నలిస్టులు అనేకరకాల సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, వారి కష్టాలు తీరేందుకు కృషిచేయాలని ప్రెస్ అకాడమీ ఛైర్మన్ ఆలపాటి సురేష్‌ను ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్ ఫోరం (ఏపీజేఎఫ్) నాయకులు కోరారు. ఈనెల 24న విజయవాడలో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ, జర్నలిస్టులందరికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, ఇల్లు కట్టుకునేందుకు ఆర్థిక సహకారం ఇప్పించాలని కోరారు. జర్నలిస్టులకు 10 లక్షల ప్రమాదబీమా వర్తింపజేయాలన్నారు. ప్రమాద బీమాతో పాటు సహజ మరణానికి కూడా ఇన్సూరెన్స్ వర్తించే విధంగా చర్యలు తీసుకుంటే జర్నలిస్టుల కుటుంబాలకు ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులకు అన్ని ప్రాంతాల్లో తమ ఫోరం ఆధ్వర్యంలో వృత్తిలో నైపుణ్యంతో రాణించేందుకు శిక్షణా తరగతులు నిర్వహింప చేయాలన్నారు. ఇతర రాష్ట్రాలతో సమానంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూడా సీనియర్ జర్నలిస్టులకు 15వేల రూపాయలు పెన్షన్ వచ్చే విధంగా చట్టాన్ని రూపొందించాలని వారు సూచించారు. ఈ సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్తానని, ప్రెస్ అకాడమీ ఛైర్మన్‌గా జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని ఆలపాటి హామీ ఇచ్చారు. ఏపీజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు (ఏపీజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు పి.శివరాజేష్, నాయకులు బ్రహ్మయ్య, వెంకటరమణ, సుభాష్, చైతన్య, ప్రశాంత్, కోటేశ్వరరావు తదితరులకు ఆయన హామీ ఇచ్చారు.

## డీకేడబ్ల్యు కాలేజీలో

# ఎన్ఎస్ఎస్ దినోత్సవం



నెల్లూరులోని డీకేడబ్ల్యు కాలేజీలో ఈనెల 24న ఎన్ఎస్ఎస్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ ఏవీ రమణారావు, రామచంద్రారెడ్డి ప్రజా వైద్యశాల డాక్టర్ రాజేశ్వరరావు తదితరులు పాల్గొని సామాజిక సేవ ప్రాధాన్యతను వివరించారు. ఎన్ఎస్ఎస్ ద్వారా జిల్లాలో అనేక గ్రామాల్లో విద్యార్థులు, యువత సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని అభినందించారు. వారందరూ మరింతగా గ్రామీణ ప్రజలకు సేవలందించడం అవసరమని వారు సూచించారు. అనంతరం, విద్యార్థినులకు క్విజ్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ కేవీ సత్యనారాయణ, కన్యాకుమారి తదితరులు పాల్గొన్నారు.

# వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించాలి

## ప్రొఫెసర్ శ్యామ్‌రథ్ పిలుపు




మనదేశాన్ని విశ్వగురువుగా తీర్చిదిద్దుకోవాలని ఆలిండియా కౌన్సిల్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్(ఏఐసీటిఇ) మెంబర్ సెక్రటరీ ప్రొఫెసర్ శ్యామ్ రథ్ పిలుపునిచ్చారు. అఖిల భారతీయ రాష్ట్రీయ సైక్షిక్ మహా సంఘ్ (ఏబిఆర్ఎస్ఎమ్) మరియు సిద్ధార్థ ఇంజనీరింగ్ కాలేజీ సంయుక్త ఆధ్వర్యంలో ఇటీవల 'నూతన జాతీయ విద్యా విధానం-సాంకేతిక విద్య అభివృద్ధి' అనే అంశంపై తిరుపతిలో జాతీయ సదస్సు జరిగింది. ముఖ్య వక్తగా శ్యామ్‌రథ్, ముఖ్యఅతిథిగా ఏబిఆర్ఎస్ఎం జాతీయ సహ సంఘటన కార్యదర్శి గుంత లక్ష్మణ్‌జీ, అతిథులుగా రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ వై.వి.రామిరెడ్డి, రాష్ట్ర టెక్నికల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ ఎన్ సుధాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ ముప్పా లక్ష్మణరావు, సిద్ధార్థ ఇంజనీరింగ్ కాలేజీ సెక్రటరీ ఆనందరెడ్డి, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాజశేఖర్, సెమినార్ కన్వీనర్ డాక్టర్ సురేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ బాలసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రొ. శ్యామ్‌రథ్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఆకాంక్షించిన వికసిత్ భారత్ లక్ష్యసాధనకు అనుగుణంగా దేశవ్యాప్తంగా సాంకేతిక విద్య పాఠ్యాంశాలలో నూతన జాతీయ విద్యా విధానానికి తగు చర్యలు తీసుకున్నామన్నారు. ఈ సదస్సులో ఆంధ్రప్రదేశ్‌లోని పలు ఇంజనీరింగ్ కళాశాలలో పనిచేస్తున్న దాదాపు 300 మంది అధ్యాపకులు పాల్గొన్నారు.

# జీఎస్టీ సేవలు మరింత సులభతరం

## జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీఎస్టీ 2.0 సంస్కరణలు, పన్నుల తగ్గింపుతో పాటు జీఎస్టీ రిజిస్ట్రేషన్, రీఫండ్, జీఎస్టీ వివాదాల పరిష్కారం వంటి సేవలు మరింత సులభతరమైనట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. ఈనెల 24న నెల్లూరు కలెక్టరేట్‌లో జీఎస్టీ నెల్లూరు డివిజన్ జాయింట్ కమిషనర్ కిరణ్‌కుమార్‌తో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. రానున్న రోజుల్లో అన్ని వర్గాల ప్రజలు జీఎస్టీ పరిధిలోకి వస్తారని తెలిపారు. నిత్యావసర వస్తువుల ధరలు, ఆరోగ్యానికి సంబంధించిన మందులు, ఇన్సూరెన్స్ ప్రీమియం వగైరాల ధరలు తగ్గుతాయన్నారు. జీఎస్టీ అమలు తీరును పరిశీలించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. వ్యాపార సంస్థల్లో తనిఖీలు నిర్వహించి సరుకుల ధరలు పాత ధరలకు అమ్మకుండా చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామస్థాయిలో పొదుపు సంఘాలు, ఇతరులకు ఈ నెల 30వతేదీ వరకు జీఎస్టీపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కిరణ్‌కుమార్ మాట్లాడుతూ జీఎస్టీ ఫలాలు ప్రజలందరికీ త్వరలోనే పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తాయన్నారు.

# ఫోటో-వీడియోగ్రాఫర్ల అవగాహన సదస్సు



నెల్లూరు సిటీ-రూరల్ ఫోటో వీడియోగ్రాఫర్స్ మరియు వీడియో మిక్సింగ్ యూనిట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 21న అవగాహన సదస్సు జరిగింది. నెల్లూరు రోటరీక్లబ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో, నిపుణులు ఎన్.గోపీకృష్ణారెడ్డి (ఏలూరు), జి.శివాజీ (విజయవాడ) పాల్గొని ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) సాంకేతికతలో ఫోటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లకు మెళకువలు తెలియజేశారు. అనంతరం వారిని అసోసియేషన్ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు.

# డా॥ కిషోర్స్ రత్నం స్కూల్‌లో.. 'ఎడ్యు.కె.టాక్స్'




విద్యార్థుల ప్రతిభను వెలికి తీసి, వారి ఆలోచనలకు, ఆవిష్కరణలకు ప్రోత్సాహాన్నందించేందుకు డా॥ కిషోర్స్ రత్నం విద్యాసంస్థల డైరెక్టర్లు డా॥ కృష్ణకిషోర్, వాసంతి కిషోర్‌లు ప్రత్యేక వేదికగా 'ఎడ్యు.కె.టాక్స్'కి రూపకల్పన చేశారు. నెల్లూరు, సరస్వతీనగర్‌లోని డా॥ కిషోర్స్ రత్నం హైస్కూల్‌లో ఇటీవల దీపకాంతుల మధ్య సువర్ణాక్షరాలతో ఆ కార్యక్రమాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న విక్రమ సింహపురి యూనివర్సిటీ రిజిస్ట్రార్ డా. సునీత మాట్లాడుతూ డా॥ కిషోర్స్ రత్నం విద్యార్థులు మారుతున్న కాలానికి అనుగుణంగా చక్కటి కార్యక్రమాలను అవలంబిస్తున్నారని, నేటి తరానికి ఇటువంటి వేదికలు చాలా అవసరమని, ఇటువంటి కార్యక్రమాలను రూపొందించిన విద్యాసంస్థల డైరెక్టర్లకు అభినందనలు తెలియజేశారు. విద్యార్థులు తమకు లభించిన ఇలాంటి చక్కటి అవకాశాలను సద్వినియోగం చేసుకుని నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ ప్రొఫెసర్ వెంకటరాయులు, డా॥ కిషోర్స్ రత్నం విద్యాసంస్థల జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు, ఏ.ఓలు తుహిన, సునీల్, జూనియర్ మేనేజర్ అజయ్‌సింగ్, ప్రిన్సిపాల్స్ మణిమాల, జ్యోతి, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# 'గ్రీన్ ఆంధ్రప్రదేశ్'ని సాధించాలి

**- కోటంరెడ్డి శీనయ్య**



ప్రతిఒక్కరూ 'గ్రీన్ ఆంధ్రప్రదేశ్' లక్ష్య సాధనకు కృషిచేయాలని నెల్లూరు నగరాభివృద్ధి సంస్థ (నుడా) ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి పిలుపునిచ్చారు. ఈనెల 20న 'స్వచ్ఛాంధ్ర -స్వర్ణాంధ్ర'లో భాగంగా, నెల్లూరులోని నుడా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలంతా తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అన్ని ప్రాంతాలు పచ్చదనంతో కళకళలాడేలా చూసుకోవాలని చెప్పారు. అనంతరం ఆయన చీపురు చేతపట్టి కార్యాలయం పరిసరాల్లో చెత్తాచెదారాన్నంతా శుభ్రం చేశారు. పరిసరాల శుభ్రతకు, పర్యావరణ పరిరక్షణకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిరంతరం కృషిచేస్తున్నారని, ఆ స్ఫూర్తితో అందరూ పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నుడా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## పెరసం.. సాహిత్య విశ్లేషణ

నెల్లూరులోని పెన్నా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఇటీవల స్థానిక కరెంటాఫీసు కూడలి సమీపంలో ఉన్న శ్రీ వేంకటేశ్వర విద్యాలయంలో ఈనెల 21 ఆదివారం సాయంత్రం 'సాహిత్యంతో సాయంత్రం' కార్యక్రమం జరిగింది. పలువురు కవులు, కవయిత్రులు పాల్గొని కవిత్వం తీరుతెన్నులను విశ్లేషించారు. పలువురు ప్రసిద్ధ కవుల కవితలను ప్రస్తావిస్తూ, వాటి ప్రాధాన్యతను విశదీకరించారు. ముఖ్య అతిథులుగా ప్రముఖ బాలసాహితీవేత్త డా. గంగిశెట్టి శివకుమార్, కవులు బొగ్గరపు రాధాకృష్ణమూర్తి, హస్తి లక్ష్మణ్‌రాజు, ప్రేమ్‌సాగర్ తదితరులు పాల్గొని కవిత్వం సమాజాన్ని ఎంతగానో ప్రభావితం చేస్తుందని, కవులు సామాజిక చైతన్యంతో మార్గదర్శకంగా ఉండాలని. ప్రముఖ కవులు అవ్వారు శ్రీధర్‌బాబు, ఐనకోట రవికుమార్, కుని అంకబాబు, అన్నం శివకృష్ణ, యల్రాబత్తిన మునీంద్ర, కవయిత్రులు తోట సులోచన, పొల్లపల్లి నాగేశ్వరి, భారతి తదితరులు పాల్గొన్నారు.

## పేకాటరాయుళ్ళ అరెస్ట్

నెల్లూరులోని ఓ లాడ్జీలో పేకాటాడుతున్న 14 మందిని చిన్నబజారు సి.ఐ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు ఇటీవల అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 2,20,110 రూపాయలను స్వాధీనం చేసుకుని, నిందితులని పోలీస్‌స్టేషన్‌కి తరలించారు.

## జీఎస్టీ తగ్గింపుతో.. పేదలకెంతో మేలు

**• బీజేపీ నేత వంశీధర్‌రెడ్డి**

జీఎస్టీ తగ్గింపుతో పేద ప్రజలకు, మధ్యతరగతి వర్గాల వారికి ఎంతో మేలు కలుగుతుందని జిల్లా బీజేపీ నాయకుడు శిపా వంశీధర్‌రెడ్డి చెప్పారు. ఈనెల 23న నెల్లూరులో నవాబుపేట సెంటర్ నుంచి ఆత్మకూరు బస్టాండు కూడలి వరకు జీఎస్టీ 2.0పై బీజేపీ ఆధ్వర్యంలో జరిగిన అవగాహన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. దేశాభివృద్ధి కోసం, దేశ ప్రజల సంక్షేమం కోసం ప్రధాన మోడీ ఆధ్వర్యంలో కేంద్రప్రభుత్వం తీసుకుంటున్న ఆర్థిక సంస్కరణలు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటున్నాయని ఆయన ఈ సందర్భంగా హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు కర్నాటి ఆంజనేయరెడ్డి, ఎరబోలు రాజేష్, బీజేపీ జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి యశ్వంత్‌సింగ్, కార్యదర్శులు రాధాకృష్ణ, సృజన, బి.శ్రీనివాసులు, పరశురామ్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరామ స్మరణం..సకల శుభప్రదం



శ్రీరాముని చరిత్ర పరమ పవిత్రమైనదని, శ్రీరామ నామస్మరణ సకల శుభప్రదమైనదని ప్రముఖ అవధాని కోట రాజశేఖర్ చెప్పారు. కోవూరు మండలం ఇనుమడుగులోని శ్రీ సత్యానందమహర్షి ఆశ్రమంలో శరన్నవరాత్రుల సందర్భంగా ఏర్పాటుచేసిన ఆధ్యాత్మిక కార్యక్రమంలో ఆయన రామాయణంలోని పలు ఘట్టాలను వివరించారు. శ్రీరాముని సత్యవాక్పరిపాలన, ధర్మనిష్ఠల గురించి భక్తులకు విశదీకరించారు. ఆశ్రమ పీఠాధిపతి శ్రీ శ్రీహరితీర్థస్వామీజీ, శ్రీ పురుషోత్తమ స్వామీజీ, రామతీర్థస్వామీజీలతో పాటు, ఆశ్రమ కార్యదర్శి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం అవధాని రాజశేఖర్‌ను ఘనంగా సన్మానించారు.

# భగవత్ శక్తిని చాటే.. 'శ్రీ దేవీ భాగవత కథలు'

వేదవ్యాస మహర్షి గంటం నుండి జాలువారిన దేవీభక్తి రసామృతం 'దేవీ భాగవతం'. ఇది పద్దెనిమిది వేల శ్లోకాలతో నిండిన పన్నెండు స్కంధాల సాహితీ మకరందం. విశేషమేమంటే జగన్నాయిక అయిన పరాశక్తే ఇందులో ప్రధాన నాయిక. ఇవి భక్తి ముక్తిదాయకమైన పురాణరాజం. ధర్మార్థకామమోక్షాలను ప్రసాదించే మహా పురాణం.

గతంలో ఎందరో పెద్దలు సంస్కృత దేవీ భాగవతాన్ని తెలుగులో పద్య, గద్య కావ్యాలుగా అందించారు. అయితే, సుమధురమైన దేవీ కథలతో పాటు, అనేక వేదాంత యోగ మంత్ర తత్త్వ ధర్మశాస్త్ర విషయాలతో ఈ గ్రంథాలన్నీ బహు విస్తారమైనాయి. పుస్తక పఠనం బాగా కరవైపోతున్న నేటి దేశ కాలమాన పరిస్థితులలో, వెయ్యి పేజీల గ్రంథాలను ఆసాంతం చదివే వారి సంఖ్య బాగా అరుదైపోయింది. అందువలన సామాన్య పాఠకునికి కూడా దేవీ భాగవతాన్ని చేరువచేసి, శ్రేయస్సు కలిగించాలనే సదుద్దేశంతో టి.వి.యల్.ప్రసాద్ చేసిన సత్ప్రయత్నానికి సాకార రూపమే ఈ 'శ్రీదేవీ భాగవత కథలు'. మూలగ్రంథ విధేయంగా సాగిన ఈ రచనలో దేవీ భాగవత సారమంతా చిక్కగా, చక్కగా నిక్షిప్తమైంది.

ఈ పుస్తకంలో డెబ్భైకిపైగా చక్కని కథలున్నాయి. సుశీలుడి కథ దేవీ నవరాత్రి వ్రత వైభవాన్ని వివరిస్తే, సమాధి- సురథుల కథ అమ్మవారికి భక్తులపై గల విశేష అనుగ్రహాన్ని తెలుపుతుంది. మహిషాసురుడు, ధూమ్రలోచనుడు, చండముండులు, రక్తబీజుడు, శుంభనిశుంభులు, దుర్గమసురుడు మొదలైన లోకకంటకులందరూ పరాశక్తి చేతిలో ఎలా నిహతులయ్యారో తెలిపే కథలన్నీ దేవీ పరాక్రమ విక్రమాన్ని కళ్ళకు గట్టినట్లు చూపిస్తాయి. స్వాహాశక్తి, స్వధాశక్తి, షష్ఠీదేవి, దక్షిణాదేవి, మంగళ చండిక, రాధ, దుర్గ, వింధ్యవాసిని, భ్రామరీదేవి వంటి శక్తిస్వరూపాల ఆవిర్భావ గాథలన్నీ మనసుకు హత్తుకుంటాయి. పుస్తకం చివరలో తేట తెలుగులో అందించిన 'మణిద్వీప వర్ణన' హృద్యంగా ఉంది. నవరాత్రులలో సునాయాసంగా పారాయణ చేసి, అనాయాసంగా ఉత్తమ ఫలితాలు పొందడానికి అనువుగా రూపొందించడమే ఈ పుస్తకం ప్రత్యేకత, విశిష్టత. 'విద్వత్కవి శిరోమణి' శ్రీమాన్ ముదివర్తి కొండమాచార్యుల ప్రియశిష్యులైన టి.వి.యల్.ప్రసాద్ ఆధ్యాత్మిక పుస్తక రచయితగా సాహితీ లోకానికి సుపరిచితులు. గూడూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌గా పదవీ విరమణ చేసిన టి.వి.యల్.ప్రసాద్ కలం నుండి 'నారాయణమ్మ పేరంటాలు', 'సుందరకాండ', 'ఆధ్యాత్మిక కథాశతం', 'పరాశర సంహిత కథలు', 'భజగోవిందం' మొదలైన నలభై గ్రంథాలు వెలువడి, బహుళ జనాదరణ పొంది, ఎన్నోసార్లు పునర్ముద్రణ జరుపుకున్నాయి. ఆధ్యాత్మిక తత్త్వప్రచారకులైన ప్రసాద్ పలు వేదికలపై ఆధ్యాత్మిక ప్రవచనాలు చేస్తూ భవిష్యత్తరానికి మార్గనిర్దేశం చేస్తున్నారు. ఎనభై ఏళ్ళ ముదిమి వయసులో కూడా చెక్కుచెదరని ఉత్సాహంతో సాహితీ వ్యవసాయం చేస్తున్న ఈ సరస్వతీపుత్రుని కలం నుండి మరిన్ని మంచి పుస్తకాలు వెలువడాలని ఆకాంక్ష. పరాశక్తి విరాట్ స్వరూపాన్ని సవివరంగా తెలుసుకోగోరే ప్రతి ఒక్కరికీ ప్రసాద్ అందించిన దేవీ ప్రసాదం ఈ "శ్రీదేవీ భాగవత కథలు".




రచయిత: టి.వి.యల్.ప్రసాద్

సెల్: 7661024370

వెల: అమూల్యం పేజీలు: 130

ప్రాప్తి స్థానం:

శ్రీమతి సిద్ధారెడ్డి ఇంద్రసేనమ్మ

నెహ్రూనగర్, సొసైటీ కాలనీ, గూడూరు.

సమీక్షకులు:

**తాటిపర్తి వెంకట శ్రీధర్**

91821 50390



## టూకీగా...



### కోవూరులో ఘనంగా ఆయుర్వేద దినోత్సవం

మండల కేంద్రమైన కోవూరులో ఈనెల 23న ప్రపంచ ఆయుర్వేద దినోత్సవం ఘనంగా జరిగింది. ఆయుర్వేద వైద్యులు డాక్టర్ గంగాధర్ ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఉచిత ఆయుర్వేద, హోమియో వైద్యశిబిరాలు నిర్వహించారు. తొలుత, ఆయుర్వేద పితామహుడు ధన్వంతరి చిత్రపటానికి వైద్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

### మాచవరంలో పోషకాహారంపై అవగాహన

కందుకూరు నియోజకవర్గంలోని మాచవరం గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో తల్లులు, పిల్లలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఈనెల 23న సీడీపీఓ ఉషారాణి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. పోషకాహారంతోనే తల్లీబిడ్డలు ఆరోగ్యంతో ఉంటారని ఆమె అవగాహన కలిగించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ప్రభావతి పాల్గొన్నారు.

### నిడిముసలిలో 'పొలం పిలుస్తోంది'

ఇందుకూరుపేట మండలం నిడుముసలి గ్రామంలో ఈనెల 23న వ్యవసాయశాఖ వారి ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం జరిగింది. పంటలు వేసిన రైతులంతా పంట వివరాలన ఈ-క్రాప్‌లో నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి రఘునాథరెడ్డి రైతులకు సూచించారు. ఆ గ్రామ సహకార సంఘం ఛైర్మెన్, సీఐఒ పాల్గొన్నారు.

### తెల్లపాడు దేవాలయానికి దాతల వితరణ

కలిగిరి మండలం తెల్లపాడు గ్రామంలోని శ్రీ భద్రకాళి అమ్మవారి దేవాలయానికి స్వర్గీయ మావిళ్ళపల్లి వెంకటేశ్వరరావు సతీమణి రాజ్యలక్ష్మి జ్ఞాపకార్థం వారి కుమారుడు బాలాజీ, కోడలు సౌదామిని ఈనెల 23న లక్ష రూపాయలు విలువచేసే వెండి పంచపాత్రలను సమర్పించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులకు వాటిని అందజేసి, అర్చకుల ఆశీస్సులందుకున్నారు.

### నర్రవాడ పీహెచ్‌సీ తనిఖీ

దుత్తలూరు మండలం నర్రవాడ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఈనెల 23న తహశీల్దార్ నాగరాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు వైద్యసేవలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. సిబ్బంది పనితీరుని పరిశీలించి, తగు సూచనలు చేశారు.

### నరసింహకండ్రిగలో గొలుసుదొంగలు

పొదలకూరు మండలం నరసింహకండ్రిగలో ఈనెల 21న ఓ ఆగంతకుడు దుకాణంలో ఉన్న మహిళ వద్ద సరుకులు కొంటున్నట్లు నటిస్తూ, హఠాత్తుగా ఆమె మెడలోని నాలుగు సవర్ల బంగారుగొలుసును లాక్కునిపోయాడు. మరో ఆగంతకుడు బైక్‌పై సిద్ధంగా ఉండగా, దానిపై కూర్చుని ఇద్దరూ పారిపోయారు. సీఐ రామకృష్ణారెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### కొత్తవంగల్లులో డా.అంబేద్కర్ జీవితంపై నాటకం

కొడవలూరు మండలంలోని కొత్తవంగల్లు గ్రామంలోని డా. అంబేద్కర్ విగ్రహం వద్ద ఈనెల 21న ఆ మహనీయుని జీవితచరిత్ర గురించి నాటకాన్ని ప్రదర్శించారు. ఎంపీటీసీ సభ్యులు నంబూరు ప్రసాద్, జైభీమ్ నాయకులు జె.మహేష్, పి.మధు, జ్యోతి మధుసుమన్‌కుమార్, జైభీమ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### రాపూరులో గురజాడ జయంతి

మహాకవి గురజాడ అప్పారావు జయంతిని పురస్కరించుకుని ఈనెల 21న రాపూరు గ్రంథాలయంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. తెలుగుభాషకు, తెలుగు సాహిత్యానికి ఆయన చేసిన సేవలను గ్రంథాలయ సహాయకుడు వెంకటేశ్వర్లు విద్యార్థులకు వివరించారు.

### ఉదయగిరి సబ్‌ట్రెజరీకి కుర్చీల బహుకరణ

ఉదయగిరి సబ్‌ట్రెజరీ కార్యాలయంలో తగినంత ఫర్నిచర్ లేక సిబ్బంది, ప్రజలు ఇబ్బందులు పడుతుండడం గమనించి, ఉదయగిరి విశ్రాంత ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు షేక్ ఖాదర్‌బాషా ఈనెల 23న 6వేల రూపాయల విలువచేసే కుర్చీలను బహుకరించారు. సబ్‌ట్రెజరీ అధికారి ఉస్మాన్ ఆ దాతకు ధన్యవాదాలు తెలిపారు.

# నవరాత్రి శోభలో.. జొన్నవాడ కామాక్షమ్మ దేవాలయం




నవరాత్రి వేడుకల సందర్భంగా బుచ్చిరెడ్డిపాళెం మండలం జొన్నవాడలో శ్రీ కామాక్షితాయి అమ్మవారి దేవాలయం విద్యుత్‌కాంతులతో, పూల అలంకరణలతో దేదీప్యమానంగా వెలిగిపోతుంది. ఈనెల 22 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు ఈ ఆలయంలో శరన్నవరాత్రి వేడుకలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. జిల్లా నుంచే కాక, రాష్ట్ర రాష్ట్రేతర ప్రాంతాల నుంచి కూడా భక్తులు అమ్మవారిని దర్శించుకోవడానికి జొన్నవాడకు వస్తున్నారు. ఈనెల 26న శ్రీ రాజరాజేశ్వరిదేవి అలంకారం, 27న శ్రీ భండాసుర వధ, 28న శ్రీ మహాలక్ష్మి, 29న శ్రీ సరస్వతి, 30న శ్రీ దుర్గాదేవి అలంకారాలతో అమ్మవారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. అక్టోబరు 1న మహర్నవమిని పురస్కరించుకుని అమ్మవారికి శ్రీ మహిషాసుర మర్ధిని అలంకారం, 2న విజయదశమి పర్వదినం సందర్భంగా ఆలయంలో శమీపూజ, అమ్మవారికి అశ్వవాహన సేవలు నిర్వహించనున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి పర్యవేక్షణలో అమ్మవారి నవరాత్రి వేడుకలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి.



# కనీస వేతనాల బోర్డు ఛైర్మెన్‌గా.. పెళ్ళకూరు

రాష్ట్ర కనీస వేతనాల బోర్డు ఛైర్మెన్‌గా నెల్లూరు జిల్లాకు చెందిన పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి నియమితులయ్యారు. ఈనెల 24న ఆయన విజయవాడలోని సీతారామపురం లేబర్ కమిషనర్ కార్యాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్యనాయుడు, ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ ఛైర్మెన్ డాక్టర్ జడ్. శివప్రసాద్ తదితరులు పెళ్లకూరును సన్మానించి శుభాకాంక్షలు చెప్పారు.




Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com